మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం
SUNDAY
8-3-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు: 8 PAGES:8 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 248

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:33 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి పంచమి రా. 9:14 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం స్వాతి మ. 1:27 వరకు తరువాత విశాఖ యోగం ధ్రువ ఉ. 6:59 వరకు కరణం కౌలవ ఉ. 8:11 వరకు తైతుల రా. 9:14 వరకు వర్జ్యం రా. 7:44 నుండి రా. 9:31 వరకు దుర్ముహూర్తం సా. 4:46 నుండి సా. 5:33 వరకు రాహుకాలం సా. 4:52 నుండి సా. 6:20 వరకు యమగండం మ. 12:27 నుండి మ. 1:55 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:52 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:57 నుండి తె. 5:45 వరకు అమృత ఘడియలు ఉ. 6:23 నుండి ఉ. 8:10 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:03 నుండి మ. 12:50 వరకు

Published from Jagitial
Circulated to Telangana

# రాష్ట్రపతికి అవమానం

### స్వాగతం పలకని బెంగాల్ సీఎం, అధికారులు

**తీవ్రంగా మండిపడ్డ ముర్ము, మోదీ**



ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిలిగురికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరపున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఘటనపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పర్యటనకు సంబంధించి సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై ముర్ము అసంతృప్తి వ్యక్తం చేశారు.

కోల్‌కతా: అంతర్జాతీయ కార్యక్రమానికి వేదిక ఎంపిక అంశానికి సంబంధించి ఏర్పాట్లను సరిగా చేయకపోవడాన్ని ముర్ము ఆక్షేపించారు. 9వ అంతర్జాతీయ సంతల్ సదస్సులో పాల్గొనడానికి సిలిగురికి వచ్చిన ముర్ము.. ముఖ్యమంత్రి నుంచి, రాష్ట్ర మంత్రుల నుంచి కూడా తనకు ఆహ్వానం అందలేదన్నారు. 'మమత నా చెల్లెలు లాంటిది. బహుశా ఆమె కోపంగా ఉండవచ్చు. నేను బెంగాల్ పర్యటనకు వస్తే ఆమె నన్ను పట్టించుకోలేదు. సంతాల్ దివస్‌కు సరైన ఏర్పాట్లు చేయలేదు. ఆ కార్యక్రమానికి మమత హాజరు కాకపోవడం నన్ను బాధించింది. ఆమె అంతర్జాతీయ కార్యక్రమాన్ని ఇంత ఇరుకైన ప్రదేశంలో నిర్వహించాలని ఎంచుకుందో నాకు తెలియదు. వేదిక పెద్దదిగా ఉంటే, సమావేశానికి ఎక్కువ మంది హాజరయ్యేవారు అని ఆమె బిధాన్‌నగర్‌లో జరిగిన మరో కార్యక్రమంలో స్పష్టం చేశారు.. బిధాన్‌నగర్‌లో సమావేశం జరిగి ఉంటే ఐదు లక్షల మంది సులభంగా హాజరయ్యేవారని కూడా ముర్ము ప్రధానంగా ప్రస్తావించారు. ఘటనను ప్రధాని మోదీ ఖండించారు. రాష్ట్రపతితో కూడా రాజకీయాలు చేయాలనుకోవడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం తరువాయి 2 వ పేజీలో...



# కప్పు కొట్టేద్దామా..!

### నేడే టీ20 వరల్డ్ కప్ ఫైనల్

### తుది సమరానికి భారత్ రెడీ

(ఈవార్తలు క్రీడా విభాగం)

టీ20 ప్రపంచకప్ 2026 తుది అంకానికి చేరుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగే ఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ భారత్, న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి మూడోసారి టీ20 విశ్వవిజేతగా నిలిచి చరిత్ర సృష్టించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. మరోవైపు తమ తొలి పొట్టి ప్రపంచకప్‌ను ముద్దాడాలని తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,364 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,340 |

### విశ్వవాణి



మగ ఎలుకలు తమ ప్రేయసిని ఇంప్రెస్ చేయడం కోసం పాటలు పాడుతాయట. అయితే, ఆ పాటలు అల్ట్రా సోనిక్ ధ్వనితో పాడటం వల్ల మనుషులు వినలేరు.



# అడవి దాటిన అన్నలు

### 130 మంది లొంగుబాటు

### ప్రభుత్వం ముందు గన్స్ సరెండర్

తెలంగాణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఎదుట భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మొత్తం 130 మంది మావోయిస్టులు సీఎం రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. సీఎం రేవంత్‌కి తమ ఆయుధాలను సరెండ్ చేశారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ దళం మొత్తం లొంగిపోయినట్లు తెలిసింది. 31 ఏకే 47 తుపాకులతో పాటుగా 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయినవారిలో ఏవోబీ కీలక నేత చలసాని నవత కూడా ఉన్నారు.

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): అంతకు ముందు నాలుగు బస్సులలో మావోయిస్టులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకున్నారు. మరో వైపు తెలంగాణ స్టేట్ కమిటీ మొత్తం లొంగిపోయినట్లు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 125 మంది మావోయిస్టులు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వారు. తెలంగాణకు చెందిన వారు నలుగురు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ఒకరు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో స్టేట్ కమిటీకి చెందిన వారు ముగ్గురు, డివిజనల్ కమిటీకి చెందిన 10 మంది, 40 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. అలాగే 70 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు ఉన్నట్లు డీజీపీ వివరించారు. 'మావోయిస్టు అగ్రనేత గణపతి అజ్ఞాతంలో తరువాయి 2 వ పేజీలో...

# ఉత్తమ కోడలు రష్మిక



### ఉత్తమ నటిగా నేషనల్ క్రష్

### ఉత్తమ నటుడిగా నాగచైతన్య

### గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రకటన

### చిరంజీవికి జాతీయ పురస్కారం

తెలంగాణ కోడలు, నేషనల్ క్రష్ రష్మిక దేవరకొండ ఉత్తమ నటి అవార్డు గెలుచుకొన్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చే ఇచ్చే నంది అవార్డుల స్థానంలో ప్రముఖ గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరిట తెలంగాణలో గద్దర్ ఫిలిం అవార్డ్స్ ఇస్తున్నారు.

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే 2025వ సంవత్సరానికి గాను తాజాగా ఈ అవార్డుల్ని ప్రకటించారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వతంత్ర జ్యూరీ కమిటీ ఈ అవార్డుల -2 వ పేజీలో...

# బాలేంద్ర షా విక్టరీ



### నేపాల్ మాజీ ప్రధాని ఓలిపై ఘన విజయం

### అధికార పీఠం కైవసం దిశగా బాలేంద్ర టీం

రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొన్న నేపాల్‌లో సాధారణ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) నాయకుడు, రాపర్ రాజకీయవేత్త బాలేంద్ర షా (బాలెన్) ఘనవిజయం సాధించారు. ఝాపా-5 నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన, ప్రధాన ప్రత్యర్థి, నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన కేపీ శర్మ ఓలిని దాదాపు 50,000 ఓట్ల భారీ తేడాతో ఓడించారని అక్కడి ఎన్నికల సంఘం తెలిపింది.

ఖట్మండు: శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 78 స్థానాల్లో 62 స్థానాలను ఆర్ఎస్‌పీ గెలుచుకుంది. 35 ఏళ్ల బాలెన్ 68,348 ఓట్లు సాధించగా, ఓలి 18,734 ఓట్లు సాధించారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. కాగా, బాలేంద్ర షా గతంలో కాఠ్‌మాండూలో మేయర్‌గా దాదాపు మూడున్నరేళ్ల కాలంలోనే రాజధానిలో అనేక సంస్కరణలు చేపట్టారు. అనంతరం బాలెన్‌గా ప్రసిద్ధి చెందారు. ప్రస్తుతం ఆయన ఆర్ఎస్‌పీ పార్టీ తరఫున ప్రధాన మంత్రి తరువాయి 2 వ పేజీలో...

# విజయ్.. సూపర్ సిక్స్

### బడి పిల్లలకు ఏటా రూ.15 వేలు

### ప్రతి మహిళకు నెలనెలా 2,500.. యువతుల పెళ్లికి బంగారం, చీర

### పేదలకు ఏటా 6 ఫ్రీ సిలిండర్లు.. టీవీకే అధినేత ఉచితాల వర్షం



తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ టీవీకే అధ్యక్షుడు, దళపతి విజయ్ అధికారమే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. తాజాగా ఓటర్లపై హామీల వర్షం కురిపించారు. మహిళల అభివృద్ధి, ఆర్థిక ప్రగతి లక్ష్యంగా హామీలు ప్రకటించారు విజయ్.

చెన్నై: ఈ మేరకు అన్ని రకాల ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పాఠశాల చిన్నారులకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం, అలాగే మహిళల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు విభాగం వంటివి విజయ్ ప్రకటించిన హామీల్లో ఉన్నాయి. విజయ్ హామీల నేపథ్యంలో తమిళనాడులో ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. తాజాగా నిర్వహించిన సమావేశంలో.. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు తరువాయి 2 వ పేజీలో...

# అది మా ధర్మం

### మానవతా దృక్పథంతో స్పందించాం

### ఇరాన్ యుద్ధ నౌకకు ఆశ్రయంపై కేంద్ర మంత్రి జైశంకర్ క్లారిటీ



న్యూఢిల్లీ: శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ డేనాను అమెరికా జలాంతర్గామితో దాడిచేసి ముంచేసిన ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. ఢిల్లీలోని రైసినా డైలాగ్‌లో జైశంకర్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్ 2026కు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోకుండా యుద్ధ ప్రభావానికి గురయ్యాయని ఆయన అన్నారు. ఆ నౌకలు యుద్ధంలో పాల్గొనడానికి రాకున్నా.. ఉద్రిక్తతల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే తిరిగి వెళ్తుండగా ఐరిస్ తరువాయి 2 వ పేజీలో...



# సారీ.. అన్నందుకు సారీ!

### తోటి గల్ఫ్ దేశాలకు ఇరాన్ సారీ.. దాడులు ఉద్దేశపూరితం కాదని వ్యాఖ్య

### కొద్దిసేపటికే ఖమేనీ సేన యూటర్న్.. దాడికి సహకరిస్తే తగ్గేదేలే అని స్పష్టీకరణ

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తన పొరుగు దేశాలపై జరిపిన దాడులకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ శనివారం క్షమాపణలు చెప్పారు. గతవారం అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. ఈ క్రమంలో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. అమెరికా మిత్రులైన గల్ఫ్ దేశాల్లో ఈ స్థావరాలు ఉండటంతో ఇరాన్ వాటిని తరువాయి 2 వ పేజీలో...

# ఇరాన్ పనైపోయింది

### పశ్చిమాసియాలో ఓడిపోయిన దేశం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవహేళన



వాషింగ్టన్: ఇరాన్‌పై సైనిక ఘర్షణలకు దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశం స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్‌ను ఎగతాళి చేస్తూ.. కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. తాజాగా, ఇరాన్‌ను అమెరికా అధినేత దారుణంగా అవమానించారు. పశ్చిమాసియాలో - 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

8.3.2026

మేషం: గృహమున కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో ఆర్ధిక పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

వృషభం: కుటుంబ సభ్యులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. సహోద్యోగులతో వివాదాలుంటాయి.

మిధునం: ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయట శ్రమాధిక్యత పెరుగుతుంది. వ్యాపారాలు వ్యవహారాలు మందగిస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నలోపం లేకపోయినా ఫలితం ఉండదు.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం లబిస్తుంది. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సేవాకార్యక్రమాలు పాల్గొంటారు.

సింహం: సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆర్థికంగా అవసరానికి ధనం లభించక ఇబ్బంది పడతారు. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

కన్య: కుటుంబ సభ్యుల నుండి ఆకస్మిక ధనలాభం పొందుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. భూ సంభందిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి.

తుల: వ్యాపార వ్యవహారాలలో అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. దీర్ఘకాలిక ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో ప్రయత్నాలు కలిసిరావు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

వృశ్చికం: సమాజంలో పెద్దలతో పరిచయాలు కలుగుతాయి. గృహమునకు చిన్ననాటి మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక సమాచారం సేకరిస్తారు. ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులుంటాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: నిరుద్యోగ యత్నాలు వేగవంతం చేస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభాలబాట పడుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.

మకరం: ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. దూరపు బంధువులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. వ్యాపారమున నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. విద్యార్థులు పోటీపరీక్షలలో మరింత కష్టపడాలి.

మీనం: సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక వాతావరణం అనుకూలిస్తుంది. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. సోదరుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.





# అడవి దాటిన అన్నలు

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నారు. ఆయన అనారోగ్య కారణాలతో అజ్ఞాతంలో ఉన్నట్టు సమాచారం ఉంది. లొంగిపోవాలని గణపతికి విజ్ఞప్తి చేస్తున్నాం. మావోయిస్టు అగ్ర నేతలు లొంగిపోవడంతో.. రాష్ట్ర కమిటీ నేతలు, కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని లొంగిపోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. 'ప్రస్తుతం లొంగిపోయిన 130 మందిని వివిధ ప్రాంతాల నుండి తీసుకుని వచ్చాం. 130 మందిని ఒక చోట చేర్చడానికి మా డిపార్ట్‌మెంట్ తీవ్రంగా శ్రమించింది. లొంగిపోయిన మావోయిస్టులకు నిబంధనలకు అనుగుణంగా పునరావాసం కల్పిస్తాం' అని వెల్లడించారు.

గణపతి జనజీవన స్రవంతిలోకి రండి: సీఎం రేవంత్

అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులు అంతా లొంగిపోవాలని..వారి లొంగుబాటుకు, సహాయ పునరావాలసాకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై హింసకు తావులేదని అన్నారు. హింసాత్మక చర్యల ద్వారా ఏమీ సాధించలేరని చెప్పారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా రాష్ట్ర పోలీసులు కృషి చేశారని, లొంగుబాటు ప్రక్రియపై మావోయిస్టుల్లో ఒక నమ్మకాన్ని కలిగించారని కితాబిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనదని, హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదని మహాత్మం గాంధీ చాటి చెప్పారు అని గుర్తు చేశారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయని అన్నారు. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు అంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసురావాలని సూచించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేసింది అని, తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని వాళ్లు చెప్పారు అని, రాష్ట్ర స్థాయిలో మేము చేయగలిగింది చేస్తామని చెప్పాను అని, మావోయిస్టు నేతల డిమాండ్లను కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చించామని వెల్లడించారు. లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా మాకు సూచించారు అని, ఆయనతో చర్చల తర్వాత మావోయిస్టు నేతలతో మళ్లీ చర్చించానని, మా చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదు. మావోయిస్టు పార్టీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి సహా మిగిలిన ఏడుగురు మావోయిస్టులు కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలి. వారి రక్షణకు ప్రభుత్వం భరోసా ఇస్తుందని స్పష్టం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం. నగదు బహుమతిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం అని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వర్గాల నిఘా ఉంటుంది అని, అంతా లొంగిపోవడం మంచిదని స్పష్టం చేశారు. లొంగిపోయిన వారి హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని, స్వగ్రామాల్లో ఇల్లు కట్టుకునేవారికి సాయం చేస్తాం అని, మెరుగైన పరిహారం, ఆరోగ్యం, ఇంటి నిర్మాణానికి సాయం చేస్తాం అని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందునా భూమి ఇవ్వడంపై హామీ ఇవ్వలేనన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయి 250 ఆయుధాలను సరెండర్ చేశారు అని వెల్లడించారు.

### పోలీసుల టచ్‌లోకి గణపతి

మావోయిస్టు అగ్రనేత గణపతి తెలంగాణ పోలీసుల టచ్‌లోకి వచ్చారు. వారం, పది రోజుల్లో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ బృందం నేపాల్, ఫిలిప్పీన్స్ వెళ్లనుంది. గణపతి పోలీసుల ముందు లొంగిపోతే రక్షణ కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో సీఎం పిలుపు నేపథ్యంలోనే గణపతి పోలీసుల టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది.

# విజయ్.. సూపర్ సిక్స్

**మొదటి పేజీ తరువాయి**

ప్రతి నెలా రూ. 2,500 అందజేయనున్నట్లు ప్రకటించారు. అలాగే యువతులకు పెళ్లి గిఫ్ట్ కింద బంగారం, చీరను అందించనున్నట్లు తెలిపారు. అలాగే అర్హులైన అన్ని కుటుంబాలకు 6 సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమిళనాడులోని మామల్లాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్ ఈ కీలక హామీలను ప్రకటించారు. అర్హులైన కుటుంబాలకు ప్రతి ఏటా ఆరు సిలిండర్లను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి అన్నపూర్ణి సూపర్ సిక్స్ స్కీమ్ అని పెట్టినట్లు స్పష్టం చేశారు. అలాగే పాఠశాలల్లో డ్రాప్ అవుట్ లను తగ్గించేందుకు చిన్నారులను బడికి పంపే ప్రతి తల్లి లేదా సంరక్షకురాలికి సంవత్సరానికి రూ. 15 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. దీనికి కామరాజార్ కల్వి ఉరుత్తి తిత్తమ్ అనే పేరును ఖరారు చేశారు.

# బాలేంద్ర షా విక్టరీ

**మొదటి పేజీ తరువాయి**

అభ్యర్థిగా ఉన్నారు.

### నేపాల్ ఎన్నికలు గర్వించదగ్గ క్షణం : భారత ప్రధాని మోదీ

నేపాల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలు నేపాల్ ప్రజాస్వామ్య ప్రయాణంలో చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. 'నేపాల్ ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కును ఉత్సాహంగా వినియోగించుకోవడం హర్షణీయమైన విషయం. నేపాల్ ప్రజలు, అక్కడి ప్రభుత్వానికి నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఎన్నికలు ఆ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో గర్వించదగ్గ క్షణం' అని పేర్కొన్నారు. భారత్, నేపాల్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య శాంతి, అభివృద్ధి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే నేపాల్‌లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంతో ఒక మిత్రుడి వలే కలిసి పనిచేసేందుకు భారత్ సంసిద్ధంగా ఉందని నొక్కి చెప్పారు.

# ఉత్తమకోడలు రష్మిక

**మొదటి పేజీ తరువాయి**

కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలను ఈ అవార్డుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 17 విభాగాల్లో గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025ను ప్రకటించారు. జ్యూరీ కమిటీ సభ్యులు తుది జాబితాను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేశారు. ఈ సమావేశంలో నిర్మాత దిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి, సంగీత దర్శకుడు మణిశర్మ, నటి రోజా రమణి, నటి ప్రగతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్యూరీ చైర్మన్ మణిశర్మ ఆధ్వర్యంలో విజేతల జాబితాను అధికారికంగా ప్రకటించారు. ఈ అవార్డుల్లో ఉత్తమ చిత్రం విభాగంలో 'రాజు వెడ్స్ రాంబాయి' మొదటి బహుమతిని గెలుచుకుంది. రెండవ ఉత్తమ చిత్రంగా 'దండోరా' ఎంపిక కాగా, మూడవ ఉత్తమ చిత్రంగా 'వెడ్డింగ్ ఫోటోగ్రఫీ' నిలిచింది. నటన విభాగంలో ఈసారి ఉత్తమ నటుడిగా నాగచైతన్య ఎంపికయ్యాడు. ఆయన నటించిన 'తండేల్' చిత్రంలో నటనకు ఈ పురస్కారం దక్కింది. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలోని పాత్రకు గానూ రష్మికకు ఉత్తమ నటి అవార్డు దక్కింది. ప్రత్యేక పురస్కారాల విభాగంలో ప్రముఖ నటుడు చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు ప్రకటించారు. ఆయన తెలుగు సినీ పరిశ్రమకు చేసిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం ఇవ్వనున్నారు. అలాగే ప్రముఖ నటి జయసుధకు ఏఎన్ఆర్ అవార్డు వరించింది. ప్రజా సమస్యలపై సినిమాలు తీసిన దర్శకుడు, నటుడు ఆర్. నారాయణమూర్తికి కాంతారావు అవార్డు ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుకు బి.ఎన్. రెడ్డి అవార్డు అందజేయనున్నారు. ఇక మరో ప్రత్యేక పురస్కారంగా ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు ప్రకటించారు. గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు సినారే అవార్డు లభించింది. ఈ పురస్కారాలు తెలుగు సినీ రంగంలో దీర్ఘకాలం సేవలందించిన కళాకారులను గౌరవంగా ఇస్తున్నారు. గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మార్చి 19న ఉగాది సందర్భంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజు విజేతలకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, కళాకారుల సమక్షంలో ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

# సారీ.. అన్నందుకు సారీ!

**మొదటి పేజీ తరువాయి**

టార్గెట్ చేసింది. దీంతో క్షిపణలు, డ్రోన్‌లతో విధ్వంసం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో పొరుగు దేశాలపై తాము ఉద్దేశపూర్వకంగా దాడులు చేయలేదని ఇరాన్ శనివారం ప్రకటించింది. డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసే ఆలోచన తమకు లేదని క్షమాపణలు చెప్పింది. అంతేకాదు, మీ భూభాగాల నుంచి మాపై దాడులు చేయకుంటే తాము కూడా ఎలాంటి చర్యలకు పాల్పడమని ఇరాన్ అధ్యక్షుడు అన్నారు. దీనిపై తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అయితే, కొద్ది గంటల్లోనే యూటర్న్ తీసుకుని.. పక్క దేశాలకు ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ న్యాయవ్యవస్థ చీఫ్ మాట్లాడుతూ.. ఇరాన్‌కు శత్రువులుగా ఉన్న దేశాలకు.. తమ భూభాగాలను దాడులకు వినియోగించుకోడానికి అవకాశం కల్పిస్తున్న పొరుగు దేశాలపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. 'మన దేశంపై దాడులకు అవసరమైన స్థావరాలను శత్రువులకు అందిస్తున్న ప్రాంతీయ పొరుగు దేశాలను ఇస్లామిక్ రిపబ్లిక్ లక్ష్యంగా చేసుకోవడం కొనసాగిస్తుంది' అని ఆయన ఉద్ఘాటించారు."ఇరాన్ సాయుధ దళాల నుంచి వచ్చిన ఆధారాలు పశ్చిమాసియాలోని కొన్ని దేశాల భౌగోళిక ప్రాంతాలు శత్రువుల వినియోగానికి బహిరంగంగా, రహస్యంగానో అనుకూలంగా ఉన్నాయని చూపుతున్నాయి" అని తాత్కాలిక నాయకత్వ మండలి సభ్యుడు అయిన ఘోలామ్‌హోస్సేన్ మొహ్సేని ఎజీ అన్నారు. 'ఈ లక్ష్యాలపై భారీ దాడులు కొనసాగుతాయి' అని ఆయన అన్నారు. కాగా, పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పిన కాసేపటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వారిని ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇరాన్ తోక ముడిచిందని, ఇక అది ఎలాంటి దాడులు చేయలేదని ఎద్దేవా చేశారు. అంతేకాదు, భారీ దాడులు తప్పవని హెచ్చరించారు.

# అది మా ధర్మం

**మొదటి పేజీ తరువాయి**

లావన్ అనే మరో నౌకలో సాంకేతిక సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. దీంతో కొచ్చి తీరంలో అత్యవసర డాకింగ్‌ను అనుమతించాలని ఇరాన్ విజ్ఞప్తి చేసిందని కేంద్ర మంత్రి చెప్పారు. ఐరిస్ డేనాపై దాడికి ముందే ఇది జరిగినట్టు వివరించారు. ఈ అంశంలో చట్టపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ.. మానవతా దృక్పథంతోనే మార్చి 1న సంబంధిత అనుమతులను భారత్ మంజూరు చేయడంతో ఈ నెల 4న లావాన్‌ను కొచ్చిలో ఇరాన్ నిలిపిందని ఆయన వెల్లడించారు. అందులోని 183 మంది సిబ్బందికి కొచ్చిలోనే ఆశ్రయం కల్పించామని, భారత్ సరైన నిర్ణయమే తీసుకుందని జైశంకర్ స్పష్టం చేశారు. అలాగే, హిందూ దాడికి గురైన ఐరిస్ డేనా ఇరాన్ యుద్ధ నౌక నుంచి తొలుత శ్రీలంక నేవీకి ప్రమాద హెచ్చరిక వచ్చిందని తెలిపారు.

ఇండియన్ నేవీ సైతం సహాయక చర్యల్లో పాల్గొందని తెలిపారు. దీనిపై నేవీ ఇప్పటికే ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తమకు బుధవారం ఉదయం (మార్చి 4న) శ్రీలంక మారిటైమ్ రెస్క్యూ కో-ఆర్డినేషన్ కేంద్రం నుంచి ప్రమాద అలర్ట్ రావడంతో స్పందించినట్టు పేర్కొంది. తొలుత లాంగ్-రేంజ్ మెరైన్ పెట్రోలింగ్ విమానం పంపిన నేవీ... ఎయిర్-డ్రాపబుల్ లైఫ్ రాఫ్టలతో కూడిన రెండో విమానాన్ని కూడా సిద్ధం చేసింది. ఐఎన్ఎస్ తరంగిణి నౌక ఆ రోజు సాయంత్రం అక్కడకు చేరుకోగా.. తర్వాత కొచ్చి నుంచి ఐఎన్ఎస్ ఇక్షక్ బయలుదేరి వెళ్లింది. ఐరిస్ డేనా ఘటనలో 150 మందికిపైగా నావికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 32 మందిని శ్రీలంక నేవీ రక్షించింది. అలాగే, మరో యుద్ధ విమానం ఐరిస్ బుష్‌హర్ శ్రీలంకలో ఇంజిన్ లోపం కారణంగా నిలిచిపోయింది. అందులోని 180 మంది సిబ్బందిని శ్రీలంక భద్రతా దళాలు రక్షించి, కొలంబోకు తరలించాయి.

# రాష్ట్రపతికి అవమానం

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. 'బెంగాల్ పర్యటనలో రాష్ట్రపతిని టీఎంసీ అవమానించింది. టీఎంసీ హద్దు మీరి ప్రవర్తిస్తోంది' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో ఆపార దుఃఖాన్ని కలిగించింది' అని ట్వీట్ చేశారు.

# ఇరాన్ పనైపోయింది

**మొదటి పేజీ తరువాయి**

అదో ఓడిపోయిన దేశం' అంటూ ఎద్దేవా చేశారు. దాడులపై పొరుగు దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పడంపై ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్ ఇక పోరాటం చేయలేక చేతులెత్తేసిందని, ఆ దేశం తోకముడిచిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "నరకయాతన అనుభవిస్తున్న ఇరాన్.. క్షమాపణలు చెప్పి, పశ్చిమాసియాలోని పొరుగు దేశాలకు లొంగిపోయింది.. ఇకపై వారిపై కాల్పులు జరపనని హామీ ఇచ్చింది. ఈ ప్రకటనకు అమెరికా- ఇజ్రాయెల్ నిరంతర దాడులే కారణం" అని అన్నారు.

# కప్పు కొట్టేద్దామా..!

**మొదటి పేజీ తరువాయి**

కివీస్ జట్టు ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్‌లో భారత్ గెలిస్తే.. 19 ఏళ్ల టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ జట్టుకూ సాధ్యం కాని రెండు అరుదైన ఘనతలను అందుకుంటుంది. ఇప్పటివరకు డిఫెండింగ్ చాంపియన్ లేదా ఆతిథ్య జట్టు టైటిల్ గెలవలేదు. ఈసారి భారత్ డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టుగా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గెలుపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఫైనల్ మ్యాచ్ కావడంతో ఐసీసీ ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డేను కేటాయించింది. మార్చి 8న వర్షం కారణంగా మ్యాచ్ ప్రారంభం కాకపోయినా లేదా మధ్యలో ఆగిపోయినా, మరుసటి రోజు (మార్చి 9) రిజర్వ్ డేన మ్యాచ్ నిర్వహిస్తారు. ఒకవేళ మార్చి 8న మ్యాచ్ ప్రారంభమై వర్షం వల్ల ఆగిపోతే, మార్చి 9న ఎక్కడైతే మ్యాచ్ ఆగిందో అక్కడి నుంచే కొనసాగిస్తారు. అంటే మళ్ళీ మొదటి నుంచి ఆడాల్సిన అవసరం ఉండదు. ఫైనల్ కోసం రెండు రోజుల్లోనూ 120 నిమిషాల అదనపు సమయం అందుబాటులో ఉంటుంది. ఓవర్లు తగ్గించి అయినా మ్యాచ్ పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు. ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్లు ఆడటం తప్పనిసరి.



# ఆరోగ్య డేటా.. 'డిజి' బాట




**సులభతరం దిశగా రోగుల బీమా క్లెయిమ్స్**

**ఒకే గొడుగు కిందకు ఆరోగ్య సంస్థలు: ఎన్‌హెచ్‌ఏ**

**ఐఐటీహెచ్‌లో ఎన్‌హెచ్‌సీఎక్స్ ఇన్నోవేషన్ మీట్**

హైదరాబాద్, మార్చి 7 (పీఐబీ): రోగులు బీమా క్లెయిమ్‌లు చేసుకోవడం అంటే పెద్ద సమస్య. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే షరతులతో బీమా క్లెయిమ్ అవుతుందా? అన్న డౌట్లు తలెత్తుతాయి. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) కీలక అడుగులు వేసింది. అన్ని ఆరోగ్య సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి డిజి బాట పట్టించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఐఐటీ క్యాంపస్‌లో 6,7 తేదీల్లో నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌హెచ్‌సీఎక్స్) ఇన్నోవేషన్ మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో.. బీమా క్లెయిమ్‌లలో ప్రభావితం చేసే ప్రక్రియ, ప్రామాణీకరణ, పరస్పరం ఆధారపడే విధానాన్ని తీసుకొచ్చే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భారత ఇన్స్యూరెన్స్ రంగంలో ఆరోగ్య క్లెమయిలు సంక్లిష్టత అనేది అత్యంత దీర్ఘకాలంగా ఎదురవుతున్న సమస్య అని డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్ తెలిపారు. మిలియన్ల మంది పౌరులను ప్రభావితం చేసే ప్రక్రియకు ప్రామాణీకరణ, పరస్పరం ఆధారపడే విధానాన్ని తీసుకురావడంలో ఎన్‌హెచ్‌సీఎక్స్ పాత్రను ఆయన వివరించారు. కాగా, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) పరిధిలో పరస్పరం ఆధారపడి పనిచేసే, నియంత్రణలకు అనుగుణంగా ఆరోగ్య పరిష్కారాల స్వీకరణను ముందుకు తీసుకెళ్లేలా నియంత్రణ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక ఆవిష్కర్తలు, విద్యాసంస్థలను ఈ కార్యక్రమం ఒక్కచోట చేర్చింది. ఈ సందర్భంగా హ్యాకథాన్ బృందాలు బీమా క్లెయిమ్‌లలో పరిష్కారమార్గాలను వివరించాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమ కార్యదర్శి సౌరభ్ గౌర్, అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరిధర్ జ్ఞాని, ఐఐటీ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ జీ నరహరి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌హెచ్‌సీఎక్స్.. క్లెయిమ్ సులభతరం**

దేశ వ్యాప్తంగా ఆరోగ్య బీమా క్లెయిముల ప్రక్రియను సులభతరం చేయడానికి, ప్రామాణికీకరణ కోసం ఎన్‌హెచ్‌సీఎక్స్ ఏర్పాటైంది. ఆసుపత్రులు, బీమా సంస్థలు, రోగుల మధ్య క్లెయిముల డేటాను సులభంగా మార్చుకోవడానికి వీలుగా ఏకీకృత డిజిటల్ మౌలిక వసతులను ఈ సంస్థ అందిస్తుంది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ), జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), నేషనల్ రిసోర్స్ సెంటర్ ఫర్ ఈహెచ్‌ఆర్ స్టాండర్డ్స్ (ఎన్ఆర్‌సీఈఎస్), ఇన్స్యూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఐఐబీ), నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్), ఐఐటీ హైదరాబాద్, గూగుల్, ఇండియా ఇన్సూర్‌టెక్ అసోసియేషన్ (ఐఐఏ), ఎన్ఏటీహెల్త్ సంయుక్తంగా ఈ హ్యాకథాన్ నిర్వహించాయి.



## సోషల్ మీడియా వల్ల మహిళలపై వేధింపులు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): సోషల్ మీడియా వల్ల మహిళలపై వేధింపులు పెరిగాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాదని వాటిని అమలు చేసి తీరాలని అన్నారు. మహిళల భద్రత కోసం పురుషులు ముందుకు రావాలనే సందేశంతో తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గతంలో మహిళలపై వేధింపులు పట్టణాలకే పరిమితమయ్యేవని ఇప్పుడు వాటి పరిధి పెరిగిందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని పథకాలు మహిళల పేరు మీదే అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో వెయ్యి బస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అందుకే వారి ప్రతిభను గుర్తించి తమ ప్రభుత్వం మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. హైటెక్ సిటీ వంటి ఖరీదైన ప్రాంతం పక్కన మహిళా ఉత్పత్తుల విక్రయం కోసం ఇందిరా మహిళా స్టాల్స్‌కు స్థలం కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ మహిళల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ, వారి ఉత్పత్తులను ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ద్వారా విక్రయించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణను అగ్రస్థానంలో నిలపడంలో




# శవాన్ని చూసైనా మారండి!


**మద్యం మత్తులో యువకుడి మృతి.. అంతిమయాత్రలో ఏసీపీ ప్రసంగం.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని హితవు**

హనుమకొండ, మార్చి 7 (ఈవార్తలు): హనుమకొండ జిల్లాలో ఓ పోలీసు ఉన్నతాధికారి చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఖాకీ దుస్తుల్లో కఠినంగా కనిపించే పోలీస్ అధికారిలోని తండ్రి మనసును ఆవిష్కరించింది. మద్యం మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఓ యువకుడి అంతిమయాత్రలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పాల్గొని, అక్కడున్న యువతకు ఆవేదనతో చేసిన హితబోధ అందరినీ కదిలించింది. సమాజం పట్ల బాధ్యతతో ఆయన మాట్లాడిన మాటలు లక్షలాది మందిని ఆలోచింపజేస్తున్నాయి. కాజీపేట పరిధిలో ఓ యువకుడు మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై మరణించాడు. అతని అంతిమయాత్రలో పాల్గొన్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మృతుడి స్నేహితులను ఉద్దేశించి భావోద్వేగంగా ప్రసంగించారు. "క్షణకాలపు మత్తు కోసం జీవితాలను పణంగా పెడుతున్నారు. గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు బానిసలై యుక్త వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు చనిపోతే నష్టపోయేది కేవలం మీ కుటుంబమే. కూలీనాలీ చేసి మిమ్మల్ని పెంచి పోషిస్తున్న మీ తల్లిదండ్రుల కన్నీళ్లకు ఎవరు సమాధానం చెబుతారు?" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పుట్టినా, చచ్చినా, పార్టీల్లో గెలిచినా, ఓడినా.. అన్నింటికీ తాగడమే పనిగా పెట్టుకున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మిమ్మల్ని అభివృద్ధి మార్గంలో నడిపించేవాడే నిజమైన స్నేహితుడు. మద్యం తాగమని, గంజాయి పీల్చమని ప్రోత్సహించేవాడు స్నేహితుడు కాదు, మీ జీవితాన్ని నాశనం చేసే శత్రువు. అలాంటి చెడు స్నేహాలను వెంటనే వదిలేయండి. చనిపోయిన మీ స్నేహితుడి శవాన్ని చూసైనా మీలో మార్పు రావాలి" అంటూ హెచ్చరించారు. ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని, పేదరికాన్ని జయించి ఉన్నత స్థానాలకు ఎదగాలే తప్ప ఇలా అర్ధాంతరంగా తనువు చాలించకూడదని హితవు పలికారు. "జీవితం ఒక్కటే, అది మళ్లీ రాదు. క్రమశిక్షణతో బతకండి. మీ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, వారి ఆశలను నిలబెట్టండి" అని సూచించారు. ప్రస్తుతం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రసంగానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా, సామాజిక బాధ్యతతో ఆయన స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రతి పోలీస్ అధికారి ఇలా స్పందిస్తే యువతలో మార్పు రావడం ఖాయమని కామెంట్లు పెడుతున్నారు.

# రేవంత్ కర్ణుడు కాదు కుంభకర్ణుడు

**సీఎంపై హరీశ్ రావు ఆగ్రహం**

**పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని ఆగ్రహం**



చొప్పదండి -కరీంనగర్, మార్చి 7 (ఈవార్తలు): తాను కర్ణుడిలాంటి వాడినన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కర్ణుడు కాదని, కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. తనను తాను కర్ణుడితో పోల్చుకుంటున్న ముఖ్యమంత్రి మహాక్రూరుడు అని మండిపడ్డారు. కర్ణుడు మాటతప్పని వాడని, తన కవచ కుండలాలను కూడా దానం చేసిన త్యాగధనుడని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడిలాంటి వాడే అయితే రైతు బంధు ఏది, ఇళ్లు కూలగొట్టి విధ్వంసం సృష్టించడం ఎందుకని నిలదీశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్, ఆరు గ్యారెంటీ హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసానికి కేరాఫ్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విమర్శలు చేయడంపై ఉన్న దృష్టి రైతుల కష్టాల మీద లేదని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చవచ్చని హరీశ్ రావు అన్నారు. ఎందుకంటే ఎన్నికలు రాగానే ఆయన నిద్రలేస్తారని, ఎన్నికలయ్యాక కేసీఆర్, బీఆర్ఎస్ మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు వేసిందని గుర్తు చేశారు.

# చెత్త బండికీ క్లీన్ ఎనర్జీ!

**ఎలక్ట్రిక్ వాహనాలే వాడాలి**

**అధికారులకు సీఎం ఆదేశాలు**



హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 99రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని త్రై మున్సిపల్ కార్పొరేషన్స్‌కు సంబంధించిన ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. క్యూర్ పరిధిలో ప్రతీరోజు ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సేకరణకు సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించేలా ఇప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కో వాహనానికి ఒక్కో ప్రాంతం చొప్పున కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నగరం పరిధి విస్తరించిన నేపథ్యంలో ఇప్పటికే కొత్తగా గుర్తించిన డంపింగ్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ల వారీగా దగ్గరలోని డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేలా, అలాగే ప్రతినిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణ రంగంలో వ్యర్థాలకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. క్యూర్ పరిధిలోని త్రై మున్సిపల్ కార్పొరేషన్లలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అపరిశుభ్రత లేకుండా చూసుకోవడం, దోమల నివారణ, సీజనల్ వ్యాధుల విషయంలో నగర వాసులకు సరైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 16 నుంచి బడ్జెట్ సమావేశాలు

**నోటిఫికేషన్ జారీ**



హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 16వ తేదీ ఉదయం 11.45 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్‌లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

## ముగ్గురు పిల్లలు దారుణ హత్య

కామారెడ్డి, మార్చి 7 (ఈవార్తలు): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ముగ్గురు చిన్నారుల మిస్సింగ్ కేసు తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిన ముగ్గురు చిన్నారులు కామారెడ్డి పెద్ద చెరువులో రాత్రి 9 గంటల తర్వాత విగతా జీవులుగా లభ్యం కావడంతో విషాదం నెలకొంది. కామారెడ్డి పట్టణంలోని ఆర్ బి నగర్ కాలనీకి చెందిన సీపత్ (8), ఆయాత్ (7), మరియం (5) అనే ముగ్గురు చిన్నారులు అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. కాగా విచారణ జరిపిన పోలీసులు కామారెడ్డి పెద్ద చెరువులో ముగ్గురు చిన్నారుల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆయాత్, మరియం మృతదేహాలు లభ్యం కాగా సీపత్ మృతదేహం అర్ధరాత్రి 12:30గంటలకు చెరువులో లభ్యం అయింది. కాగా, కన్న తండ్రే ఆ చిన్నారులని చంపి చెరువులో మృతదేహాలను పడేసినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తల్లి పలువురి ఇళ్లల్లో పాచి పనులు చేసుకుంటుండగా తండ్రి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది.

## ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

**కడియం, దానంల కేసుల్లో తీర్పు రిజర్వ్**

**8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్**

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం క్లైమాక్స్ కు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పక్షాన చేరిన పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు తుది విచారణ ముగించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగుస్తుండటంతో స్పీకర్ తీసుకున్న నిర్ణయం కీలకంగా మారింది. ఇందులో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్, వారిపై ఉన్న పిటిషన్లను కొట్టివేశారు. అయితే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసుల్లో మాత్రం తీర్పును రిజర్వ్ చేశారు. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

## పని చేయరు.. చేయనీయరు!

**పరకాల ఎమ్మెల్యేపై కొండా సురేఖ విమర్శలు**

పరకాల, మార్చి 7 (ఈవార్తలు): అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తరచూ సంచలన వ్యాఖ్యలతో నిలుస్తుంటారు. సొంత పార్టీ నేతలపైన విమర్శనాస్త్రాలు సంధించే సురేఖ.. ఈసారి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరికల సందర్భంగా మాట్లాడిన మంత్రి 'కొన్ని నియోజకవర్గాల్లో వాళ్ల నీడను కూడా వాళ్ళు నమ్మలేని పరిస్థితి ఉంది.. వాళ్లు పని చేయరు ఇంకొకరిని చేయనివ్వరు' అని రేవూరి ప్రకాశ్ రెడ్డిని పరోక్షంగా విమర్శించారు. సొంత పార్టీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తీరును తప్పుపట్టిన మంత్రి సురేఖ.. ఆయనతో అటు పార్టీకి, ఇటు ప్రజలకు నష్టమని అన్నారు. 'పని చేయని ఎమ్మెల్యేలు.. ఇంకొకరికి అడ్డుపడే ఎమ్మెల్యేల దగ్గరికి వెళ్లబుద్ధి కాదు. నిజం చెప్పాలంటే.. అలాంటి వాళ్ల కారణంగా పార్టీ నష్టపోతుంది..ప్రజలు కూడా నష్టపోతారు' అని మంత్రి కొండా సురేఖ ఘాటుగానే పరకాల ఎమ్మెల్యేపై మండిపడ్డారు.



# రైతు కొడుకు సివిల్స్ విజేత

జగిత్యాల రూరల్, మార్చి 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు చెందిన యువకుడు సివిల్స్‌లో మెరిశాడు. జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన పూదరి రాహుల్ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 748వ ర్యాంక్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రాహుల్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం వెనుక తన తల్లిదండ్రుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నాలుగో ప్రయత్నంలో ఈ ర్యాంక్ సాధించానని వెల్లడించారు. గంగలక్ష్మి-మల్లేశం దంపతులకు ముగ్గురు సంతానం కాగా, పెద్ద కుమారుడు రవితేజ సివిల్ సర్జన్‌గా శిక్షణ పొందుతున్నారు. రాహుల్ బాసర ట్రిపుల్ఐటీలో బీటెక్ పూర్తి చేశారు.



# థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలి: ఎస్పీఎస్

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): ఉద్యోగ భద్రత లేకుండా నరకం అనుభవిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్లకు న్యాయం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎస్పీఎస్ కమిటీ కోరింది. శనివారం మంత్రిని కలిసిన బృందం.. ఏజెన్సీల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. కనీస వేతనం నెలకు రూ.26,000 ప్రభుత్వం ద్వారా నేరుగా ఐఎఫ్ఎంఐఎస్ విధానంలో కార్మికుల అకౌంట్లలో వేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,800 మంది కార్మికులను ఆదుకోవాలని, జీవో నంబర్ 60ని సవరణ చేయాలని విజ్ఞప్తి చేసింది. తమ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేశ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, ఎస్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వైనాల రవి, జాయింట్ సెక్రెటరీలు గొర్రె నాగరాజు, అంజలి, శ్రావణ్ కుమార్, గాంధీ హాస్పిటల్‌కు చెందిన సిబ్బంది ఆనంద్, మురళి, ఏటూరు నాగారం హాస్పిటల్ నాయకులు రమేశ్, లక్ష్మణ్, కల్యాణ్, జ్యోతి, రజిత, ఇతర నేతలు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణలు

బెజ్జంకి, మార్చి 7 (ఈవార్తలు): పంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణలు చేసిన ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో చోటుచేసుకుంది. డంపింగ్ యార్డులో పశువులను ఉండొద్దని చెప్పినందుకు, కక్ష కట్టి ఆమె పనితీరును శంకించేలా ఓ వ్యక్తి పత్రికల్లో వార్తలు రాయించినట్లు తెలిసింది. వివరాల్లోకెళితే.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డంపింగ్ యార్డులో పశువులను కట్టేయడమే కాకుండా, వ్యక్తిగత ట్రాక్టర్‌ను పార్క్ చేశాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు వెళ్లగా, ఆమె వాటిని తొలగించాలని సూచించారు. దీంతో ప్రభుత్వ అధికారిణిపై కోపం పెంచుకున్న సదరు వ్యక్తి.. పత్రికల్లో ఆమెకు వ్యతిరేకంగా వార్తలు వడ్డించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై లక్ష్మీపూర్ బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రెండ్ల అనిల్ మాట్లాడుతూ.. పేపర్ స్టేట్‌మెంట్లతో ప్రభుత్వ ఉద్యోగులపై తప్పుడు రాతలు రాయించడం సబబు కాదన్నారు. సదరు వ్యక్తి తప్పు చేయడమే కాకుండా, దబాయింపులు చేయడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని బుద్ధిగా మసులుకోవాలని హెచ్చరించారు.




# మహిళలకు సమాన అవకాశాలు అవసరం

**శ్రీ వేంకటేశ్వర విద్యా సంస్థల ముఖ్య సలహాదారు పమ్మి సునీత**

హైదరాబాద్, మార్చి 7 (ఈవార్తలు): జనాభాలో సగభాగమైన మహిళలకు పురుషులతో సమానంగా అన్నింటిలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీ వేంకటేశ్వర విద్యా సంస్థల ముఖ్య సలహాదారు పమ్మి సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణగూడ లోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లంకా భవానీ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పమ్మి సునీత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మహిళల్లో ప్రతిభావంతులైన వారు చాలా ఉన్నారని, వారికి ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వాలిసన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారతతోనే వారి సమస్యలు పరిష్కారం కాగలవని, స్త్రీలు శక్తివంతులైనప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని అన్నారు. మహిళలు అబలలు కాదని వారు తలచుకుంటే ఏదైనా చేయగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆమె పిలుపునిచ్చారు. ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహిళలను నేటి విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబంతో పాటు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆధునిక జీవన విధానంలో మహిళలకు బాధ్యతలు పెరుగుతున్నాయని, మహిళలను అర్థం చేసుకుని వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు మహిళలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి అభినందించారు. గీతా ప్రకాష్ నాయుడు, పి.శిరీష, మట్టే వినోద, భారతి కల్యాణ్ దుర్గ, గీత, జి. వేంకటేశ్వర్లు, కేశిరాజు కామేష్, తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా న్యూటన్ హైస్కూల్ వార్షికోత్సవం

**అలరించిన చిన్నారుల ప్రదర్శనలు!**

మోతీనగర్, మార్చి 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మోతినగర్‌లో రాయల్ ఫంక్షన్ హాల్‌లో న్యూటన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కరస్పాండెంట్ జనార్ధన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో వార్షికోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సుభాషిణి వార్షిక నివేదికను సమర్పించి, పాఠశాల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు స్టేజీపై సందడి చేశారు. టీచర్ల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భారీ సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శనలను చూసి మురిసిపోయారు. కార్యక్రమంలో న్యూటన్ స్కూల్ మోతీనగర్ బ్రాంచ్ హెడ్స్ రవి, రాజు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లస్కర్లకు వేతనాలు పెంపు

విజయవాడ, మార్చి 7 (ఈవార్తలు): ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జలవనరుల శాఖలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న లస్కర్లకు శుభవార్త చెప్పింది. వారి రోజువారీ వేతనాలను గణనీయంగా పెంచుతూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో వారి వేతనం రూ. 350 నుంచి రూ. 550కి పెరగనుంది. లస్కర్లు చాలాకాలంగా తమ వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి వినతిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, వేతనాల పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు జలవనరుల శాఖ పరిధిలోని సీఏడీఏ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పెంచిన వేతనాలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ స్పష్టం చేశారు. ఈ వేతనాల పెంపుతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రోత్సాహం అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలను వెంటనే అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కొత్త ఆలోచనలకు క్రియేటివ్ సిటీ



న్యూఢిల్లీ: 'విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

**అవకాశాల గనిగా భారత్**

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

# ఆ పొరపాటు చేయను

**డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్**

అమరావతి, మార్చి 7 (ఈవార్తలు): 'ముప్పై ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ విషయంలో చేసిన పొరపాటును.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి విషయంలో పునరావృతం కానివ్వను' అని ప్రముఖ రియల్ ఎస్టేట్, హౌసింగ్ సంస్థ డీఎల్ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాజీవ్ సింగ్ నేడు భేటీ అయ్యారు. ఢిల్లీలోని రైసినా డైలాగ్-2026 వేదిక వద్ద జరిగిన ఈ సమావేశంలో.. గత స్మృతులను, నాటి పెట్టుబడి అవకాశాలను రాజీవ్ సింగ్ గుర్తుచేసుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో.. హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూములపై పెట్టుబడులు పెట్టాల్సిందిగా తనకు స్వయంగా సూచించారని రాజీవ్ సింగ్ గుర్తుచేశారు. అయితే, నాడు తాను చంద్రబాబు దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను సరిగ్గా అంచనా వేయలేకపోయానని అన్నారు. ఆనాడు సీఎం సలహా పాటించి ఉంటే.. నేడు ఎంతో లాభపడేవాళ్ళమని, ఓ గొప్ప పెట్టుబడి అవకాశాన్ని చేజార్చుకున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు విజన్, సైబరాబాద్ నిర్మాణంతో నేడు రాయదుర్గం ప్రాంతం దేశంలోనే ప్రముఖ ఐటీ, వాణిజ్య కేంద్రంగా మారిందని కొనియాడారు. హైదరాబాద్ విషయంలో చేసిన పొరపాటును అమరావతి విషయంలో చేయదలచుకోలేదని రాజీవ్ సింగ్ స్పష్టం చేశారు. ఏపీలో కొత్తగా నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు డీఎల్ఎఫ్ అత్యంత ఆసక్తిగా ఉందని ముఖ్యమంత్రికి తెలిపారు. త్వరలోనే అమరావతిని సందర్శించి, అక్కడ ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. డీఎల్ఎఫ్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రానికి రావడం శుభపరిణామమన్నారు. కేవలం అమరావతిలోనే కాకుండా.. విశాఖపట్నం అభివృద్ధిలోనూ భాగస్వామ్యం కావాలని రాజీవ్ సింగ్‌ను సీఎం కోరారు. అమరావతి, విశాఖపట్నం నగరాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన పాలసీలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను ఈ సందర్భంగా డీఎల్ఎఫ్ చైర్మన్‌కు సీఎం వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాజీవ్ సింగ్ సుముఖత వ్యక్తం చేయడం పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు: సజ్జల



తాడేపల్లి, మార్చి 7 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

# జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ మక్వానాకు అస్వస్థత

రాజమండ్రి, మార్చి 7 (ఈవార్తలు): రాజమండ్రి పర్యటనలో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా ఈ మధ్యాహ్నం ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడం స్థానికంగా ఆందోళన కలిగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ప్రస్తుతం రాజమండ్రిలో ఉన్నారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎస్సీల సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తుండగా ఆయనకు ఒక్కసారిగా వాంతులు అయ్యాయి. దీంతో అధికారులు సమావేశాన్ని నిలిపివేసి తక్షణమే స్పందించారు. వెంటనే ఆయనను సమీపంలోని డెల్టా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స అందించి, వివిధ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఆహారం వికటించడం లేదా తీవ్రమైన పని ఒత్తిడి వల్ల ఈ అస్వస్థత కలిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.



# అవకాశమిస్తానని అసభ్య చిత్రీకరణ

**జూబ్లీహిల్స్ పీఎస్‌లో దర్శకుడిపై కేసు**

కాకినాడ, మార్చి 7 (ఈవార్తలు): సినిమాల్లో అవకాశాల పేరిట యువతులను మోసం చేస్తున్న ముఠాల ఉదంతాలు హైదరాబాద్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి. వెబ్ సిరీస్ ఆడిషన్ పేరుతో ఒక యువతిని నమ్మించి, అసభ్యకర వీడియోలు చిత్రీకరించి వేధిస్తున్న ఒక డైరెక్టర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు వివరాల్లోకి వెళితే... ఏపీలోని కాకినాడకు చెందిన 23 ఏళ్ల యువతి సినీ రంగంపై ఆసక్తితో హైదరాబాద్‌కు వచ్చి, యూసుఫ్‌గూడలోని తన స్నేహితురాలి వద్ద ఉంటూ అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో శంకర్ అనే వ్యక్తి తాను డైరెక్టర్‌నని పరిచయం చేసుకుని, ఒక వెబ్ సిరీస్‌లో అవకాశం ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. ఆడిషన్ పేరుతో ఆమెను తన కారులో ఎక్కించుకుని అసభ్యకరమైన డైలాగులు చెప్పించడమే కాకుండా, కొన్ని అభ్యంతరకర సన్నివేశాలను చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోలను బాధితురాలి అనుమతి లేకుండా తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశాడు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయి, చివరకు ఆమె తల్లిదండ్రుల వరకు చేరడంతో, వారు యువతిని తీవ్రంగా మందలించారు. ఆందోళన చెందిన బాధిత యువతి ఆ వీడియోలను డిలీట్ చేయాలని డైరెక్టర్‌ను కోరగా, అతను అందుకు నిరాకరించడమే కాకుండా... మరిన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తానని ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో యువతి జూబ్లీహిల్స్



# సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం

## ప్రపంచంలోనే అత్యధిక జీతం!.. రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు

**టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది.**

న్యూయార్క్: ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌డపీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి. కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.



## అమెరికా థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థ ధ్వంసం

**జోర్డాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ భీకర దాడి**

టెహ్రాన్: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం రోజురోజుకీ తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ ఉద్రిక్తతల నడుమ అమెరికాకు ఊహించని షాక్ తగిలింది. జోర్డాన్‌లో మోహరించిన అమెరికాకు చెందిన అత్యంత విలువైన మిసైల్ డిఫెన్స్ రాడార్ సిస్టమ్‌ను ఇరాన్ విజయవంతంగా ధ్వంసం చేసినట్లు వెల్లడైంది. జోర్డాన్‌లోని మువాఫ్ఫక్ సల్టి ఎయిర్ బేస్‌లో ఉన్న ఏఎన్/టీపీవై-2 రాడార్‌ను ఇరాన్ క్షిపణులు పూర్తిగా నాశనం చేశాయని వాణిజ్య శాటిలైట్ చిత్రాల ద్వారా బయటపడింది. సుమారు 300 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.2,500 కోట్లు) విలువైన ఈ రాడార్, అమెరికా 'థాడ్' మిసైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో అత్యంత కీలక భాగం. బాలిస్టిక్ క్షిపణులను ఎత్తులోనే గుర్తించి, వాటిని కూల్చివేయడానికి ఇది ఉపయోగపడుతుంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలోనే ఈ దాడి జరిగిందని అమెరికా అధికారులు కూడా ధృవీకరించారు. ఖరీదైన ఈ రాడార్ ధ్వంసం కావడంతో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా, మిత్రదేశాల రక్షణ వలయంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామంపై ఎఫ్‌డీడీ డిప్యూటీ డైరెక్టర్ ర్యాన్ బ్రాబ్స్ మాట్లాడుతూ.. "థాడ్ రాడార్‌పై దాడి ఇరాన్‌కు ఇప్పటివరకు లభించిన అతిపెద్ద విజయం" అని అభిప్రాయపడ్డారు. మరోవైపు, సీఎస్ఐఎస్ నిపుణుడు టామ్ కారకో స్పందిస్తూ.. అమెరికా ఆర్మీ వద్ద ఇలాంటి రాడార్లు కేవలం 8 మాత్రమే ఉన్నాయని, స్పేర్ రాడార్లు లేకపోవడంతో ఇది వ్యూహాత్మకంగా పెద్ద దెబ్బ అని విశ్లేషించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పెంటాగాన్, వెంటనే ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు రక్షణ రంగ సంస్థలతో చర్చలు మొదలుపెట్టింది. ఇప్పటికే ఖతార్‌లోని మరో రాడార్ కూడా దెబ్బతిన్నట్లు వార్తలు వస్తుండటంతో అగ్రరాజ్యం అప్రమత్తమైంది.

## మీ పని మీరు చూసుకోండి


**ట్రంప్‌పై కమల్ హాసన్ ఫైర్.. భారత్ సార్వభౌమాధికార దేశమని స్పష్టీకరణ**



చెన్నై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ అంతర్గత విషయాల్లో విదేశాల జోక్యాన్ని పరోక్షంగా తప్పుబడుతూ ఆయన ఒక బహిరంగ లేఖ ద్వారా తన నిరసనను, అభిప్రాయాన్ని బలంగా వెల్లడించారు. తాము స్వతంత్ర దేశ పౌరులమని, విదేశాల ఆదేశాలకు తలొగ్గే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. "మిస్టర్ ప్రెసిడెంట్.. మేం (భారతీయులు) స్వతంత్ర, సార్వభౌమాధికారం కలిగిన దేశానికి చెందిన ప్రజలం. సుదూర తీరాల నుంచి వచ్చే ఆదేశాలను స్వీకరించే రోజులు ఎప్పుడో పోయాయి. మీ సామర్థ్యం మేరకు మీ పనేదో మీరు చూసుకుంటే మంచిది" అంటూ కమల్ హాసన్ అమెరికా అధ్యక్షుడికి ఘాటుగా సూచించారు. దేశాల మధ్య పరస్పర గౌరవం ఉన్నప్పుడే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని ఆయన హితవు పలికారు. అది మాత్రమే శాశ్వత ప్రపంచ శాంతికి ఏకైక పునాది అని ఆయన పేర్కొన్నారు. అయితే, చివరగా అమెరికా దేశానికి, అక్కడి ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. "ఒక గర్వించదగ్గ భారతీయ పౌరుడు" అంటూ ఈ లేఖను కమల్ హాసన్ ముగించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. భారత్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని కమల్ హాసన్ తన లేఖ ద్వారా స్పష్టమైన సందేశాన్ని పంపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత్ కు 30 రోజుల పాటు అనుమతి ఇస్తున్నామని అమెరికా ప్రకటన చేసిన నేపథ్యంలో, కమల్ హాసన్ స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది.

## మాతో ఆటలా?

**10 యుద్ధ నౌకల నిర్మిస్తున్నాం.. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ రక్షణ రంగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక సంపత్తి విషయంలోనూ తమ విధానాన్ని మార్చుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దాదాపు 3 మిలియన్ డాలర్ల ఖరీదైన రాకెట్లను వాడటం కంటే.. భారీ తూటాలను ప్రయోగించే యుద్ధ నౌకలే మేలని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు శత్రువుల గుండెల్లో భయం పుట్టించవచ్చని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా ఇలాంటి 10 భారీ యుద్ధ నౌకలను నిర్మిస్తోందని, ఇవి గతంలో కంటే 100 రెట్లు శక్తివంతమైనవని ట్రంప్ వెల్లడించారు. ఈ విధ్వంసకర నౌకలను వాడాలన్నది తమ ఉద్దేశం కాదని, కానీ ఈ శక్తి సామర్థ్యాలు చూసి ఎవరూ అమెరికాతో ఆటలాడుకునే సాహసం చేయరని స్పష్టం చేశారు. చాలా మంది తనను యుద్ధం కోరుకునే వ్యక్తిగా చిత్రీకరిస్తుంటారని, కానీ వాస్తవానికి 8 యుద్ధాలను ముగించింది తానేనని ట్రంప్ గుర్తుచేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధినేతల మధ్య తీవ్రమైన ద్వేషం ఉందని, వారిని చర్చలకు ఒప్పించడం చాలా కష్టమైన పని అని ట్రంప్ వ్యాఖ్యానించారు. సముద్రం అడ్డుగా ఉండటం వల్ల ఆ యుద్ధం ప్రభావం అమెరికాపై పెద్దగా ఉండదని, కేవలం యూరప్ కు మేలు చేసేందుకే తాను ఈ ప్రయత్నాలు చేస్తున్నానని చెప్పారు. ఇదే సమయంలో భారత్-పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలపైనా ఆయన స్పందించారు. ఆ రెండు దేశాల మధ్య పరిస్థితులు చేయిదాటిపోయేలా ఉన్నప్పుడు, తాను వాణిజ్యపరమైన సుంకాలను అస్త్రంగా ప్రయోగించి సమస్యను పరిష్కరించానని, ప్రజల ప్రాణాలను కాపాడానని ట్రంప్ పేర్కొన్నారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం తనకుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## కొత్త యూటీ లేదు: కేంద్రం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి కారిడార్ సమీపంలో కొత్తగా ఒక కేంద్రపాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరిగింది. అయితే ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, అవన్నీ తప్పుడు ప్రచారాలేనని తెలిపింది. కొత్త కేంద్రపాలిత ప్రాంతం ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద లేదని స్పష్టం చేసింది. బీహార్ లోని పూర్ణియా, కిషన్ గంజ్, అరారియా, కటిహార్, పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ఉత్తర దినాజ్ పూర్ జిల్లాలను కలిపి సిలిగురి సమీపంలో కొత్తగా కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోందని, తద్వారా ఈ వ్యూహాత్మక ప్రాంతంలో భద్రత మరింత బలోపేతమవుతుందంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ కథనం చక్కర్లు కొట్టింది. అయితే ఈ దీనిపై నిరాధార ప్రచారం సాగుతోందని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. ఇలాంటి వాటిని షేర్ చేసినప్పుడు అధికార వర్గాల నుంచి ధృవీకరించుకోవాలని సూచించింది.

## విడాకుల విషయం నేను చూసుకుంటా

చెన్నై: తన భార్య విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంపై ప్రముఖ తమిళ సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ స్పందించారు. నా వ్యక్తిగత విషయాలు మిమ్మల్ని ఇబ్బందిపెడుతుంటే బాధగా ఉందని కార్యకర్తలను, అభిమానులను ఉద్దేశించి అన్నారు. వాటి విషయం తాను తర్వాత చూసుకుంటానని అన్నారు. చెంగల్పట్టులో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల తనకు ఎదురవుతున్న సమస్యలు, బాధల గురించి కార్యకర్తలు, అభిమానులు ఎవరూ ఆలోచించవద్దని సూచించారు. తన సమస్యలపై మీరు పోరాటం చేసి అవతలి వారిని బాధించవలసిన అవసరం ఏమాత్రం లేదని అన్నారు. వాటిని నేను చూసుకుంటాను, మీరు మాత్రం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. వ్యక్తిగత విషయాలు ఎలా పరిష్కరించుకోవాలో తనకు తెలుసని విజయ్ అన్నారు. కానీ ఇవి మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే నాకు బాధగా ఉందని అన్నారు. విజయ్ భార్య సంగీత చెంగల్పట్టు కోర్టులో కొన్నిరోజుల క్రితం విడాకుల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈరోజు కూడా తన విడాకుల కేసు విచారణ ముగిసే వరకు తాను విజయ్ ఇంట్లోనే ఉండేలా అనుమతి ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు.

## హార్ముజ్‌లో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

**ప్రైమా అనే ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ అటాక్**

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హార్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది. షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హార్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హార్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతీబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

## బిలియనీర్ల ఆస్తి 112.6 లక్షల కోట్లు



ముంబై: భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026' ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్జ్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

## సీఎం పదవి అధిష్ఠానం ఇష్టం: సిద్ధరామయ్య



బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పదవీకాలం మరో రెండేళ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో.. పార్టీ హైకమాండ్ అనుమతిస్తే మరో రెండు బడ్జెట్‌లను తానే ప్రవేశపెడతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. పరోక్షంగా, పూర్తి టర్మ్ తానే సీఎంగా కొనసాగుతాననే కోణంలో వ్యాఖ్యానించారు. సీఎం పీఠం కోసం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సిద్ధంగా ఉన్న నేపథ్యంలో సిద్ధరామయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. శనివారం వరుణ హోబ్లీలోని పిల్లహళ్లి హెలిప్యాడ్ వద్ద జిల్లా యంత్రాంగం నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రిగా కొనసాగడం, బడ్జెట్ ప్రవేశపెట్టడంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. రాష్ట్ర ప్రజలు తాను కొనసాగాలని కోరుకుంటున్నారని, అయితే అంతిమ నిర్ణయం మాత్రం హైకమాండ్‌దేనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. "నాకు పూర్తి నమ్మకం ఉంది. అధిష్టానం తీసుకునే నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటాను. బడ్జెట్‌ల విషయంలో రికార్డులు బద్దలు కొట్టడం ముఖ్యం కాదు, కానీ అవకాశం ఇస్తే చేయడం సాధ్యమే" అని ఆయన అన్నారు. తాను ఇప్పటివరకు 17 బడ్జెట్‌లను ప్రవేశపెట్టానని, రాష్ట్రంలో ఇదే అత్యధికమని గుర్తు చేశారు. మీడియా ప్రతినిధులు ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగినా తన సమాధానం మారదని, హైకమాండ్ ఉండమంటే ఉంటానని, వద్దంటే తప్పుకుంటానని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్ ధరల పెరుగుదలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర ఎంత ఉందో అందరికీ తెలుసని, బీజేపీ వచ్చాకే ధరలు పెరిగాయని ఆరోపించారు. మీడియా ఈ విషయాలను రాయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం దండిమారమ్మ, సిద్దప్పాజీ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కుంభాభిషేక మహోత్సవంలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమిరేట్స్ సేవలు పునఃప్రారంభం




దుబాయ్: ప్రముఖ విమానయాన సంస్థ ఎమిరేట్స్ తన సర్వీసులను పునఃప్రారంభించింది. భద్రతా కారణాల రీత్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే కార్యకలాపాలను తిరిగి మొదలుపెట్టినట్లు తాజాగా వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రయాణికులకు తాజా సమాచారం అందించింది. ఇవాళ మధ్యాహ్నం నుంచి బుకింగ్స్ కన్ఫర్మ్ అయిన ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు రావచ్చని ఎమిరేట్స్ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దుబాయ్ మీదుగా ప్రయాణించే (ట్రాన్సిట్) ప్రయాణికులకు కూడా ఇది వర్తిస్తుందని, అయితే, వారి కనెక్టింగ్ ఫ్లైట్ షెడ్యూల్ ప్రకారమే నడుస్తోందని నిర్ధారించుకోవాలని సూచించింది. ప్రయాణానికి ముందు తమ అధికారిక చానెళ్ల ద్వారా ఫ్లైట్ స్టేటస్, సీట్ల లభ్యతను చెక్ చేసుకోవాలని కోరింది. అంతకుముందు, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు దుబాయ్ నుంచి అన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు, ప్రయాణికులు ఎవరూ ఎయిర్‌పోర్ట్‌కు రావద్దని ఎమిరేట్స్ ప్రకటించింది. అయితే, ఈ పోస్ట్ ప్రయాణికులలో అనవసర గందరగోళానికి దారితీయడంతో దానిని తొలగించినట్లు సంస్థ వివరించింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అవసరమైతే ఆపరేషనల్ షెడ్యూల్‌లో మార్పులు చేస్తామని ఎమిరేట్స్ తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. ప్రయాణికుల సహనానికి ధన్యవాదాలు" అని పేర్కొంది.

## రూ.50 టికెట్‌కు రూ.30 లక్షల లాటరీ




బర్నాలా: ఒక వ్యక్తి రూ.50 పెట్టి లాటరీ టిక్కెట్ కొనుగోలు చేశాడు. అతనికి రూ.30 లక్షల లాటరీ తగిలింది. కానీ లాటరీ టిక్కెట్ కొనుగోలు చేసిన ఆ వ్యక్తి మాత్రం ఎవరో తెలియడం లేదు. ఈ ఆసక్తికర సంఘటన పంజాబ్ రాష్ట్రంలోని బర్నాలాలో జరిగింది. అతని ఆచూకీ కోసం నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తున్నారు. మైకులు, డప్పులతో గల్లీలలో చాటింపు వేయిస్తుండటం గమనార్హం. నెలవారీ లాటరీ నిర్వహించే ఒక సంస్థ ఫిబ్రవరి 26న విజేతలను ప్రకటించింది. బర్నాలా రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక ఏజెంట్ వద్ద కొనుగోలు చేసిన నెంబరుకు లాటరీ తగిలింది. కానీ ఆ టిక్కెట్‌పై కొనుగోలు చేసిన వారి పేరు, ఫోన్ నెంబర్ తదితర వివరాలు లేవు. కమీషన్ కింద ఏజెంటుకు రూ.1 లక్ష అందజేశారు. అయితే విజేతను ప్రకటించిన నెల రోజుల్లోగా ప్రైజ్ మనీ తీసుకోని పక్షంలో అది ప్రభుత్వ ఖజానాకు వెళుతుంది. అందుకే, ఈ లాటరీ తగిలిన వ్యక్తి కోసం ఆ ఏజెంటు గల్లీ గల్లీ తిరుగుతూ మైకులు, డప్పు చప్పుల్లతో చాటింపు వేయిస్తున్నాడు. లాటరీ తగిలిన వ్యక్తి వస్తే ప్రైజ్ మనీ ఇవ్వడం కోసం ప్రాంగణాన్ని బెలూన్లతో అలంకరించారు. టిక్కెట్ కొనుగోలు చేసిన వ్యక్తి ఆచూకీ దొరకకపోవడం స్థానికంగా ఆసక్తిని రేపింది.

లవ్యూరి చిత్రం






# ప్రేమకు థ్యాంక్స్: త్రిష


సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొన్నేళ్లుగా తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తున్న స్టార్ అండ్ సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్ గా క్రేజ్ సంపాదించుకున్న త్రిష.. ఇప్పటికీ అదే గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా త్రిష ఎంతో యాక్టివ్ గా ఉంటారు. తరచూ తన ఫోటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ట్రెండింగ్ లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె చీరకట్టులో దిగిన ఫోటోలు షేర్ చేయగా.. అవి ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. క్రీమ్ కలర్ పట్టుచీరలో త్రిష కనిపించిన ఆ ఫోటోలు అభిమానులను, సినీ ప్రియులను ఫిదా చేస్తున్నాయి. ఆ పిక్స్ ను షేర్ చేస్తూ "ఎల్లప్పుడూ నా అభిమానులుగా ఉండి నాకు ప్రేమ చూపిస్తున్నందుకు ధన్యవాదాలు" అంటూ క్యాప్షన్ రాసుకొచ్చారు.

# విజయ్ ఇంట్లోనే ఉండనివ్వండి: భార్య

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్‌కి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. సినిమాలకు గుడ్ బై చెప్పేసి రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న ఆయనపై ముప్పెట దాడి జరుగుతోంది. ఆయన నటించిన చివరి సినిమా జన నాయగన్ జనవరి 9న రిలీజ్ కావాల్సింది. ఈ సినిమాతో రాజకీయాల్లో సంచలనం సృష్టించాలని ప్లాన్ చేసుకున్న విజయ్‌కి తీవ్ర నిరాశే ఎదురైంది. సెన్సార్ అభ్యంతరాలు



చెప్పడం, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడానికి షరతులు విధించడంతో సినిమా రిలీజ్ అర్థాంతరంగా నిలిచిపోయింది. ఇదే సమయంలో విజయ్ టీవీకే పార్టీ ప్రచారంలో భాగంగా కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరగడం, అందులో పిల్లలు, పెద్దలు, మహిళలు, యువకులు దాదాపుగా 40 మందికి పైగా మృతి చెందడంతో విజయ్ పొలిటికల్ ఎంట్రీ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు కావడం, భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరగడంతో సీబీఐ రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో విజయ్‌కి కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. పార్టీ జెండాపై కూడా వివాదం చెలరేగడంతో ఈ అంశం కోర్టు దాకా వెళ్లింది. హైకోర్టు తీర్పు ఇచ్చే వరకు విజయ్ పార్టీ జెండాకు ఎలాంటి ఇబ్బంది లేదు కానీ అనుకూలంగా తీర్పు రాకపోతే మాత్రం పార్టీ జెండా మార్చుకోక తప్పని పరిస్థితి. ఇదే సమయంలో విజయ్‌పై తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి తెరతీసి విజయ్‌ని ఇరుకున పెట్టాయి. త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి వస్తే బాగుంటుందని బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇదే సమయంలో విజయ్‌పై మరో బాంబు పడింది. ఆయన భార్య సంగీత విజయ్ నుంచి విడాకులు కోరుతూ చెంగల్‌పట్టు జిల్లా ఫ్యామిలీ కోర్టుని ఆశ్రయించడం సంచలనంగా మారింది. ఒక నటితో విజయ్ వివాహేతర సంబంధమే విడాకులకు కారణమంటూ విడాకుల పిటీషన్‌లో సంగీత పేర్కొనడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.








# ఎన్టీఆర్ అవార్డు గొప్ప గౌరవం

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక 'గద్దర్ చలనచిత్ర అవార్డులు-2025'లో తనకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం దక్కడంపై మెగాస్టార్ చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ గారి పేరు మీదుగా ఉన్న అవార్డును అందుకోవడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా చిరంజీవి స్పందిస్తూ... "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు. సినీ పరిశ్రమలో ప్రతిభను, కష్టాన్ని గుర్తించి గౌరవించడం ఎప్పుడూ ఆనందాన్నిస్తుంది. నన్ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జ్యూరీ సభ్యులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. నా ఈ ప్రయాణంలో ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నాకు కొండంత బలం" అని రాసుకొచ్చారు. కాగా, శనివారం ప్రభుత్వం ప్రకటించిన ఎనిమిది ప్రత్యేక పురస్కారాల్లో చిరంజీవితో పాటు పలువురు దిగ్గజాలకు అవార్డులు దక్కాయి. కమల్ హాసన్‌కు పైడి జైరాజ్ అవార్డు, జయసుధకు అక్కినేని అవార్డు, నిర్మాత అశ్వినీదత్‌కు నాగిరెడ్డి-చక్రపాణి అవార్డులు ప్రకటించారు. అలాగే సుద్దాల అశోక్ తేజకు సినారె అవార్డు, ఆర్ నారాయణమూర్తికి కాంతారావు అవార్డు, దర్శకుడు సంగీతం శ్రీనివాసరావుకు బి.ఎన్.రెడ్డి అవార్డు, రమేష్ ప్రసాద్‌కు రఘుపతి వెంకయ్య అవార్డులు లభించాయి. చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు రావడంపై కింగ్ నాగార్జున, దర్శకుడు అనిల్ రావిపూడి సహా పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రి ఏఎన్నార్ పేరిట అవార్డును నెలకొల్పినందుకు ప్రభుత్వానికి నాగార్జున ధన్యవాదాలు తెలుపుతూ, జయసుధకు ఆ అవార్డు రావడం సముచితమన్నారు. అలాగే 'తండేల్' చిత్రానికి గాను తన కుమారుడు నాగచైతన్య ఉత్తమ నటుడిగా ఎంపికవడం పట్ల నాగ్ ఆనందం వ్యక్తం చేశారు.







## గద్దర్ అవార్డులు-2025 విజేతలు వీరే..

ఉత్తమ చిత్రం (మొదటి బహుమతి): రాజు వెడ్స్ రాంబాయి
రెండవ ఉత్తమ చిత్రం: దండోరా
మూడవ ఉత్తమ చిత్రం: ది ప్రీ వెడ్డింగ్ షో
ఉత్తమ పర్యావరణ చిత్రం - ఇగ్వా
ఉత్తమ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ - లిటిల్ హార్ట్స్
ఉత్తమ వినోదాత్మక చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ సోషల్ మెసేజ్ చిత్రం - కోర్టు
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ - మిరాయ్
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ నటుడు- నాగచైతన్య (తండేల్)
ఉత్తమ నటి: రష్మిక మందన్నా (ది గర్ల్ ఫ్రెండ్ )
ఉత్తమ దర్శకుడు- సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ సహాయ నటుడు- శివాజీ (దండోరా)
ఉత్తమ సహాయ నటి- భూమిక (యుఫోరియా )
ఉత్తమ సంగీత దర్శకుడు- మార్క్ కె. రాబిన్ (దండోరా)
ఉత్తమ మేల్ సింగర్- అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ ఫిమేల్ సింగర్- సాహితి చాగంటి (కన్నప్ప)
ఉత్తమ హాస్య నటుడు- శ్రీ కృష్ణ తేజ (జిగ్రిస్)
ఉత్తమ బాలనటుడు- రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో )
ఉత్తమ స్టోరీ రైటర్ - గుణశేఖర్ (యుఫోరియా )
ఉత్తమ గేయ రచయిత - నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్- శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్ - ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి)
ఉత్తమ కొరియోగ్రాఫర్ - గిర గిర గిర (ఛాంపియన్)
ఉత్తమ ఆర్ట్ డైరక్టర్ - తోట తరణి (ఛాంపియన్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ - గోవింద్ (అఖండ)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ - చంద్రకాంత్ (ఛాంపియన్)
ఉత్తమ స్పెషల్ జ్యూరీ ఫిల్మ్ - (23)
ఉత్తమ మేల్ యాక్టర్ - చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నటి - అనంతిక (8 వసంతాలు)
స్పెషల్ జ్యూరీ హీరో - రోషన్ (ఛాంపియన్)
ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ - అనిల్ రావిపూడి

### గౌరవ పురస్కారాలు (లెజెండరీ అవార్డ్స్):

ఎన్టీఆర్ అవార్డు- చిరంజీవి
ఏఎన్ఆర్ అవార్డు- జయసుధ
కాంతారావు అవార్డు- ఆర్ నారాయణమూర్తి
బీఎన్ రెడ్డి అవార్డు- సింగీతం శ్రీనివాసరావు
పైడి జయరాజ్ అవార్డు -కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వినీదత్






# కర్మ వదిలిపెట్టదు

విక్షణ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన నటి వరలక్ష్మీ శరత్ కుమార్ తొలిసారి డైరెక్టర్‌గా మారి ఆమె చేసిన ఫస్ట్ ఫిల్మ్ సరస్వతి. ప్రియమణి, ప్రకాష్ రాజ్, కిషోర్, శ్రీకాంత్ అయ్యంగార్, సప్తగిరి కీలక పాత్రల్లో నటించారు. ప్రచార చిత్రంతో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా మార్చి 6న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీకి సాయి మాధవ్ బుర్రా స్టోరీ అందించారు. సినిమా విశ్రమ ఫలితాన్నిచ్చింది. ఈ నేపథ్యంలోనే రైటర్ సాయి మాధవ్ బుర్రా సోషల్ మీడియా వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. నా కథని మానభంగం చేశారని, నేను అందించిన కథతో సినిమా ప్రారంభించి తరువాత కథ మార్చేశారని, కనీసం తనకు మార్పుల విషయం చెప్పలేదని ఆరోపించారు. అయితే ఆయన ఆరోపణలపై వరలక్ష్మీ శరత్‌కుమార్ తాజాగా స్పందించారు. సాయి గారు ఒక్క సిట్టింగ్‌కు కూడా రాలేదన్నారు. ఆయన బిజీగా ఉన్నారు. పెద్ద సినిమాలు చేస్తున్నారు. ఒక సెన్సిటీవ్ ఇష్యూపైన రేప్ అనే వర్డ్ మీ లాంటి వాళ్ల నోటి నుంచి రావడం బాగాలేదు. మనం వాడే పదాలు జాగ్రత్తగా కొంచెం చూసుకుని మాట్లాడాలి అన్నారు.

# కాజల్ రేంజ్ కు ఇది అవసరమా?



హీరోయిన్లు సాధారణంగా షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ తోపాటు లోకల్ బిజినెస్ ప్రారంభోత్సవాల్లో పాల్గొనడం కామన్. చాలా మంది హీరోయిన్లు ఆ ట్రెండ్ ను ఫాలో అవుతూ వస్తున్నారు. కానీ ఇప్పుడు అలా పాల్గొన్న టాలీవుడ్ చందమామ, బ్యూటీ కాజల్ అగర్వాల్ చేసిన ఓ రీల్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. దీంతో అనేక మంది నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు రెస్పాండ్ అవుతున్నారు. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ఒకప్పుడు అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్లలో కాజల్ అగర్వాల్ కూడా ఒకరు. అనేక స్టార్ హీరోల సరసన నటించి వరుస హిట్స్ అందుకున్న ఆమెకు ఇప్పటికీ ఆడియన్స్ లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.



# ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ ఫైనల్‌కు లక్ష్య సేన్

ప్రపంచ నంబర్ 12 బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్య సేన్ ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ 2026 ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీస్‌లో విక్టర్ లై పై విజయం సాధించాడు. విక్టర్‌పై 21-15, 18-21, 21-16 తేడాతో లక్ష్య సేన్ విజయం సాధించాడు. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ పోరులో విజయం కోసం ఇరువురూ హోరాహోరీగా పోరాడారు. అయితే, మూడో సెట్ సమయంలో లక్ష్య సేన్ కండరాలు పట్టేయడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. అయినా సరే, చివరి వరకూ పోరాడి గెలిచాడు. మూడో సెట్‌లో ఆధిక్యంలో ఉన్నప్పుడు ఛైర్ అంపైర్ "లక్ష్య సేన్ మీరు కొనసాగుతారా? రిటైర్ అవుతారా?" అని ప్రశ్నించారు. కాసేపు ఫిజియో సాయం తీసుకున్న అతడు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజయం సాధించి ఫైనల్‌లో అడుగుపెట్టాడు. తుది పోరులో విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకుంటే.. ప్రకాశ్ పదుకొణె, పుల్లెల గోపీచంద్ తర్వాత మూడో భారత ప్లేయర్‌గా నిలుస్తాడు.

# టీమిండియాకు గులాబీ ముల్లు

## ఓటమి ముంగిట మహిళల జట్టు

ఆస్ట్రేలియాతో ఏకైక పింక్ బాల్(డే/నైట్) టెస్టులో టీమిండియా ఓటమి ముంగిట నిలిచింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెత్తులెత్తేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత మహిళల జట్టు ఓటమికి చేరువైంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో 6 వికెట్లకు 105 పరుగులు చేసింది. క్రీజులో ప్రతికా రావల్(84 బంతుల్లో 6 ఫోర్లతో 43)తో పాటు స్నేహ్ రాణా(4) ఉంది. ప్రస్తుతం భారత్ 20 పరుగుల వెనుకంజలో ఉంది. ఆస్ట్రేలియా బౌలర్లలో హమిల్టన్(3/32) మూడు వికెట్లతో.. అన్నబెల్ సదర్లాండ్(2/15) రెండు వికెట్లతో భారత్ పతనాన్ని శాసిచింది. బ్రౌన్‌కు ఒక వికెట్ దక్కింది. మూడో రోజు ఆట తొలి సెషన్‌లో ఈ మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉంది. చివరి నాలుగు వికెట్లను ఎంత త్వరగా తీస్తే ఆసీస్ విజయలాంఛనం అంత వేగంగా పూర్తవుతుంది. అంతకుముందు 96/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 90.4 ఓవర్లలో 323 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌటైంది. అన్నబెల్ సదర్లాండ్(171 బంతుల్లో 17 ఫోర్లతో 129) సెంచరీతో రాణించగా.. ఎల్లిస్ పెర్రీ(116బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 76) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. భారత బౌలర్లలో సయాలి సత్ఘరే(4/50) నాలుగు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్(2/72), దీప్తి శర్మ(2/67) రెండేసి వికెట్లు తీసాడు. స్నేహ్ రాణా, షెఫాలీ వర్మ చెరో వికెట్ తీసారు. అనంతరం 125 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే బిగ్ షాక్ తగిలింది. స్మృతి మంధాన(2), షెఫాలీ వర్మ(5), జెమీమా రోడ్రిగ్స్(14), హర్మన్‌ప్రీత్ కౌర్(11), రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపర్చడంతో 82 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి.




# ఐసీసీ ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి విదేశీ క్రికెట్లు

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా కొద్దిరోజులుగా భారత్‌లోనే ఉండిపోయారు విదేశీ ఆటగాళ్లు. 'మమ్మల్ని ఎప్పుడు వెనక్కి పంపిస్తారు?' అని వెస్టిండీస్ హెడ్‌కోచ్ డారెన్ సమీ సోషల్ మీడియాలో పలువురు ఆందోళన వ్యక్తం చేయడం చూశాం. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి విదేశీ ఆటగాళ్లకు తీపి కబురు చెప్పింది. త్వరలోనే



వారిని స్వదేశం పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఐసీసీ వెల్లడించింది. వరల్డ్‌కప్ మధ్యలోనే మొదలైన పశ్చిమాసియా యుద్ధంతో చివరకు విదేశీ ఆటగాళ్ల పాలిట విలన్‌లా మారింది. యుద్ధం కారణంగా పలు దేశాల గగనతలాల మూసివేయడంతో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ ఆటగాళ్లు మరో దారిలేక భారత్‌లోనే ఉండిపోయారు. దాంతో.. కొందరు ఇక్కడే ఎన్ని రోజులు ఉండాలి? అని అసహనం వ్యక్తం చేశారు. 'నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా.. మమ్మల్ని రేపు పంపిస్తారా? వచ్చే వారమా? .. ఏదో ఒకటి చెప్పండి' అని విండీస్ కోచ్ డారెన్ సమీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఇండియాలోనే ఉండిపోయిన ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా క్రికెటర్లు, కోచింగ్ బృందాన్ని ఐసీసీ ప్రత్యేక విమానాల్లో సొంత దేశానికి తరలించనుంది. మార్చి 5న జరిగిన సెమీ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ జట్టు.. శనివారం రాత్రి ముంబై నుంచే స్వదేశానికి బయల్దేరనుంది. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ బృందం.. ఆదివారం కోల్‌కతా మీదుగా ప్రత్యేక విమానాల్లో వెళ్తారని సమాచారం. సఫారీ జట్టులోని కేశవ్ మహారాజ్, జేసన్ స్మిత్, జార్జ్ లిండే మాత్రం పరిమిత ఓవర్ల సిరీస్ కోసమని న్యూజిలాండ్ వెళ్లనున్నారు.

# అసలైన చోకర్స్ న్యూజిలాండ్ జట్టే

పొట్టి ప్రపంచకప్ సెమీఫైనల్లో అనూహ్య తడబాటుతో దక్షిణాఫ్రికా మరోసారి తాము చోకర్స్ అనిపించుకుంది. ఐసీసీ ఈవెంట్లలో లీగ్ దశను గొప్పగా ఆడడం.. తీరా నాకౌట్స్‌లో చేతులెత్తేయడం ఆ జట్టుకు పరిపాటిగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే సఫారీ టీమ్‌ను అందరూ చోకర్స్ అనడం మామూలైపోయింది. కానీ, మాజీ పేసర్ డేల్ స్టెయిన్ మాత్రం తమ జట్టును చోకర్స్‌గా పిలవడాన్ని ఖండించాడు. మేము కాదు.. అసలైన చోకర్స్ న్యూజిలాండే అని అతడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచ క్రికెట్‌లో చోకర్స్ అనే ట్యాగ్ దక్షిణాఫ్రికాకు నూటికి నూరు శాతం సరిపోతుంది. ప్రతిసారి ఐసీసీ ఈవెంట్లలో సెమీస్ వరకూ వెళ్లడం.. ఫైనల్ చేరినా విజేత అనిపించుకోకుండానే ఇంటిదారి పట్టడం సఫారీలకు ఒక అలవాటుగా మారింది. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ ఫైనల్లో గెలిచే మ్యాచ్‌ను వదిలేసింది ప్రొటీస్ జట్టు. ఈసారి కప్‌ను పట్టేద్దామని మర్క్రమ్ సేన లీగ్ దశ నుంచి సూపర్ 8 వరకూ అజేయంగా నిలిచింది. కానీ, సెమీస్‌లో న్యూజిలాండ్‌ను నిలువరించలేక ఉసూరుమంటూ నిష్క్రమించింది. పట్టుదలకు కొదవ లేకున్నా.. అదృష్ట దేవత అనుగ్రహానికి నోచుకోని సఫారీలకు మళ్లీ చోకర్స్ ట్యాగ్‌ను ఆ జట్టుకు ఆపాదిస్తున్నారంతా. ఈ నేపథ్యంలో ఆ దేశ దిగ్గజం డేల్ స్టెయిన్ మాత్రం.. అసలైన చోకర్స్ న్యూజిలాండ్ జట్టే అని ఘంటాపథంగా చెబుతున్నాడు. 'చోకర్స్ అనే విషయంలో మనం నిజాయతీగా ఉందాం. ప్రతి ఒక్కరూ దక్షిణాఫ్రికాను చోకర్స్ అంటున్నారు.

# సూర్యకుమార్ రిటైర్మెంట్..?




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ తుది దశకు చేరింది. భారత్-న్యూజిలాండ్ మధ్య ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ ముగియనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా హాట్ ఫేవరెట్‌గా ఈ మ్యాచ్ బరిలోకి దిగుతోంది. వరుసగా రెండో టైటిల్ గెలిచి సరికొత్త చరిత్రను లిఖించాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు తొలి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడాలనే కసితో న్యూజిలాండ్ ఉంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఈ మ్యాచ్ తర్వాత టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ఊహగానాలు వినిపిస్తున్నాయి. కప్ గెలిచినా.. ఓడినా సూర్య కెరీర్‌కు ఈ మ్యాచ్‌తో ఎండ్ కార్డ్ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం 35 ఏళ్ల వయసులో ఉన్న సూర్యకుమార్ యాదవ్.. కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు. ఇప్పటి వరకు అతను ఒకే ఒక్క టెస్ట్ మ్యాచ్ ఆడాడు. రెండేళ్లు వన్డే జట్టులో కొనసాగినా.. 2023 ప్రపంచకప్ ఫైనల్లో పేలవ ప్రదర్శనతో వేటుకు గురయ్యాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన తర్వాత రోహిత్, కోహ్లీ, జడేజా ఒకేసారి టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. రోహిత్ స్థానంలో టీ20 సారథ్య బాధ్యతలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్.. జట్టును అద్భుతంగా నడిపించాడు. అతని సారథ్యంలో భారత్ ఒక్కటంటే ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. సొంతగడ్డపై జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026లోనూ భారత్ ఫైనల్ చేరుకుంది. ఆదివారం న్యూజిలాండ్‌తో ఫైనల్లో విజయం సాధిస్తే.. టీమిండియాకు ప్రపంచకప్ అందించిన సారథుల జాబితాలోకి సూర్య చేరుతాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు పలకడానికి ఇంతకంటే మంచి సందర్భం అతనికి మరొకటి ఉండదు. సూర్య వయసు కూడా పైబడింది. ఫామ్ తగ్గింది.




## ఎర్రమట్టి పిచ్

తుది మ్యాచ్‌కు పిచ్ ఎలా ఉంటుందనే ప్రశ్న కూడా తలెత్తింది. రెండు వారాల క్రితం నల్లమట్టి పిచ్‌పై సౌతాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత, భారత జట్టు యాజమాన్యం ఎర్రమట్టి పిచ్‌ను ఎంచుకుంది. నరేంద్ర మోడీ స్టేడియంలో ఎర్ర, నలుపు, రెండు కలిసిన మూడు రకాల పిచ్‌లు ఉన్నాయి. వాంఖడే స్టేడియంలో ఎర్రమట్టి పిచ్ భారత్ ఉత్తమ బ్యాటింగ్ ప్రదర్శన చేసింది. దాంతో ఫైనల్‌కు కూడా ఎర్రమట్టి పిచ్‌ను ఎంపిక చేశారు. ఆదివారం జరగనున్న ఫైనల్‌కు ముందు, నరేంద్ర మోడీ స్టేడియంలో సుమారు లక్ష మంది ప్రేక్షకులను అలరించడానికి అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామీ అవార్డు గ్రహీత, ప్యూర్టో రికన్ గాయకుడు రికీ మార్టిన్, 'దాండియా క్వీన్' ఫాల్గుణి పాఠక్, బాలీవుడ్ ప్లేబ్యాక్ సింగర్ సుఖ్వీందర్ సింగ్ అభిమానులను అలరించనున్నారు. టాస్‌కు ముందు ఐసీసీ ఒక మ్యూజిక్ కచేరీని కూడా ఏర్పాటు చేసింది. రికీ మార్టిన్ పాడిన ప్రసిద్ధ పాట 'అన్ దోస్ ట్రెస్ వన్ టూ త్రీ మరియా' పాటకు అభిమానులు స్టెప్పులేస్తారని అంచనా వేస్తున్నారు.

### ఫైనల్ కోసం స్పెషల్ ట్రైన్

ఫైనల్ మ్యాచ్ కోసం అహ్మదాబాద్ వెళ్లే అభిమానుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, మ్యాచ్ రోజున ముంబై నుంచి అహ్మదాబాద్‌కు రైల్వే ఒక ప్రత్యేక రైలును నడపనుంది. విమాన ఛార్జీలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అభిమానుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# టీమిండియా.. సెంటిమెంట్స్!

## ప్రతి మ్యాచ్‌కు ముందు దైవదర్శనాలు

## చంద్ర గ్రహణం వేళ ప్రాక్టీస్‌కు బ్రేక్

## తాజాగా హోటల్ మారిన భారత జట్టు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలిచేందుకు భారత జట్టు అన్ని మార్గాలను వాడుకుంటుంది. మైదానంలోనే కాకుండా బయటి సెంటిమెంట్స్‌ను కూడా గట్టిగా ఫాలో అవుతుంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. అయితే ఈ మ్యాచ్ కోసం టీమిండియా తమ హోటల్‌నే మార్చేసింది. పాత హోటల్ అచ్చిరావడం లేదని నమ్మిన టీమిండియా.. ఈ పనిచేసింది. జట్టు సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్న ఒక వ్యక్తి ఇలాంటి వాటిని బాగా ప్రోత్సహిస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. ఏ నగరంలో మ్యాచ్‌కు వెళ్లినా అక్కడి ప్రఖ్యాత దేవాలయానికి ఆటగాళ్లను తీసుకెళ్లి దర్శనం చేయించడం ఆయనకు రివాజుగా మారిపోయింది. సెమీఫైనల్‌కు ముందు చంద్రగ్రహణం కారణంగా టీమిండియా తమ ప్రాక్టీస్ సెషన్‌ను గంట వాయిదా వేసుకుంది. చంద్రగ్రహణం ముగిసేవరకు ఆటగాళ్లు ఎవరూ హోటల్ బయటకు రాలేదు. ఇప్పుడు కూడా ఫైనల్ కోసం మరో సెంటిమెంట్‌ను టీమిండియా బలంగా నమ్ముతోంది. అహ్మదాబాద్‌లో 2023 వన్డే ప్రపంచకప్ ఆడినప్పుడు భారత జట్టు ఐటీసీ నర్మద హోటల్‌లో బస చేసింది. కానీ ఆ మ్యాచ్‌లో టీమిండియా ఘోర పరాజయం చవిచూసింది. తాజా



టీ20 ప్రపంచకప్ టోర్నీలోనూ సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్ సమయంలోనూ భారత జట్టు ఈ హోటల్‌లోనే బస చేయగా.. ప్రతికూల ఫలితం వచ్చింది. దాంతోనే ఆ హోటల్ అదృష్టం లేదని భావించిన టీమ్ మేనేజ్‌మెంట్.. ఈ సారి తాజ్ స్కైలైన్ హోటల్‌కు మారింది. దీంతో తమ అదృష్టం మారవచ్చని టీమ్ భావిస్తోంది. మరోవైపు మ్యాచ్ జరిగే అహ్మదాబాద్ స్టేడియంలో కూడా హోమ్ కాకుండా విజిటర్స్ డ్రెస్సింగ్ రూమ్ వాడుకోవాలని టీమ్ నిర్ణయించింది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 8-3-2026

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# ప్రజాస్వామ్యం మానభంగం!

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫిరాయింపుల పర్వం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి, బహిరంగంగానే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేల విషయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన 'క్లీన్ చిట్' తీర్పులు రాజ్యాంగ స్ఫూర్తిని పరిహసించేలా ఉన్నాయి. పదవ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటు వేయాల్సింది పోయి, ఆధారాలు లేవు అన్న సాకుతో ఫిర్యాదులను కొట్టివేయడం అత్యున్నత వ్యవస్థల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. ముఖ్యమంత్రిని కలిసినప్పుడు కండువాలు కప్పుకోవడం, బహిరంగ వేదికలపై పార్టీ మారుతున్నట్లు ప్రకటించినా, అవి అభివృద్ధి కోసమే అన్న ఎమ్మెల్యేల వాదనను స్పీకర్ అంగీకరించడం గమనార్హం. సుప్రీంకోర్టు విచారణ జరగడానికి ఒక్కరోజు ముందుగానో లేదా గడువు ముగుస్తున్న తరుణంలోనో ఈ నిర్ణయాలు వెలువడటం రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. రాజ్యాంగాన్ని కాపాడతామని చెప్పే పార్టీలు, అధికార దాహంతో ఫిరాయింపులను ప్రోత్సహించడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మాయని మచ్చ. ఓటర్లు ఒక గుర్తుపై ఓటేసి గెలిపిస్తే, వారి ఆకాంక్షలను కాలరాస్తూ గెలిచిన పార్టీకి ద్రోహం చేయడం ప్రజాస్వామ్య ద్రోహమే. సాంకేతిక కారణాలను చూపుతూ అనర్హత నుంచి తప్పించడం ద్వారా ఫిరాయింపులకు చట్టబద్ధత కల్పించినట్లయింది. ఈ తరహా ధోరణులు కొనసాగితే ఎన్నికల వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం సడలిపోతుంది. ఇప్పటికైనా న్యాయస్థానాలు జోక్యం చేసుకుని, పదవ షెడ్యూల్ ఆశయాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.



దేవులపల్లి రమేశ్
కలం: వామిక శ్రీ వర్ష
9963701294

## ఓ మగువ..
## నీకు వందనం

మహిళ అంటే ఒక శక్తి
సృష్టికి మూలం మహిళ
మహిళతోనే మనుగడ
మరువలేము నీ త్యాగం!!

ఆమె సహనానికి మారుపేరు
అక్క చెల్లి అమ్మగా తనదైన పాత్ర
మహిళా నీకు శతకోటి వందనాలు
ఆత్మగాళ్ళ మనసుకలిగిన మహిళ!!

ఆమె ఒక అమ్మ ఒక నాన్న
ఆమె పొద్దుతో పోటీ పడుతుంది
కాలంతో పోటీ పడుతుంది ఆమె
ఈ జగతిన సరిలేరు నీకెవ్వరు!!

ప్రేమ త్యాగం సహనం ఆమె
మగువ మనుగడకే ప్రాణం పోసేది
అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం
భూమాతకు ఉండే సహనం ఆమెది!!

అలుపెరుగని ఓర్పు ఆమెది
నిరంతర శ్రమజీవి ఆమె
ఓ మగువా నీకు వందనం
ఆమెతోనే మన జీవన ప్రయాణం!!



మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..

# ఆమె.. ఆత్మాభిమానం..!

**ఎత్రనార్యంతు పూజ్యంతే తత్ర రమంతి దేవతః**

పురాణాలలో ఇతిహాసాలలో ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని చెప్పబడింది స్త్రీని దేవతగా పూజించి గౌరవించాలని చెప్పిన పురాణాలతో ఇతిహాసాలతో మనకు పని లేదా? అనాదిగా స్త్రీలు అవమానాలతో అనుమానాలతో బాధపడుతూ ఉంటే మన భారత రాజ్యాంగం సవరించి రచించిన స్త్రీ రక్షణ చట్టం ఏం చేస్తుంది స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్త్రీకి సమానత్వం రావాలంటే ఆర్థికంగా కుమారులతోపాటు కూతుర్లకు కూడా సమాన హక్కు రావాలని పోట్లాడే రాజ్యాంగాన్ని సవరించి రాయించిన సమాన ఆస్తి హక్కు చట్టం నేడు వినియోగించబడుతుందా? ఇలా చట్టాలు పోరాటాలు చేసే శిక్షలు రాస్తూ నేరాలు చేసిన వారిని తప్పించుకునే విధంగా ఉంటే మళ్లీ మళ్లీ మహిళలు అవమానాలకు వేదనకు గురి అవుతూ ప్రాణత్యాగాలు చేసుకుంటూ పోతే ఇప్పటికే వందమంది మగవారు ఉంటే 99 మంది ఆడవాళ్లు ఉంటున్నారని ప్రపంచ జనాభా లెక్కలు చెబుతుంటే సృష్టికి మూలం అయిన స్త్రీ జాతి నిలుస్తుందా? లేదా పురాణాలలో లేక లోక కల్యాణం కోసం ఇద్దరు ముగ్గురు భార్యలు ఉన్నట్లు మరి మన కలియుగంలో అలా ఉంటే చట్టాలు ఒప్పుకుంటాయా? ఒప్పుకున్న ఒక భర్త అందరి భార్యలను సమానంగా చూసే అవకాశం ఉంటుందా?

స్త్రీ లేనిదే ఏ రంగం కూడా లేదనేది స్పష్టం.. ఎందెందు వెతికిన అందందే మహిళ అనే నానుడి ఈ సందర్భానికి సరిపోతుందేమో!" ముఖ్యంగా ఒక 80 సంవత్సరాల క్రితం వ్యవసాయ కూలీలుగా మగవారు ఉన్నప్పుడు విత్తనాలు మందుల కోసం పరిగెడితే తర్వాత విత్తనాలు నాట్లు కలుపు తీయడం పంట చేతికి వస్తున్నప్పుడు వంతులు వేసుకొని పొలాలకు కాపలాగా ఉంటూ మళ్లీ ఇంటి బాధ్యతలను చక్కబెట్టడం ఇలా ఇంటి కోసం ఆర్థికంగా తన కుటుంబం రోజు కడుపునిండా అన్నం తినాలని మానసిక శారీరక శ్రమను త్యాగం చేసిన ఆనాటి స్త్రీమూర్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కానీ కుటుంబ నిర్ణయాలు తీసుకుని అవకాశం ఉండేది ఒకసారి మన గతంలోకి వెళితే సమాధానం దొరుకుతుంది సొంత భూమి ఉంటే తన భూమిలో రాత్రి పగలు పనిచేసే మహిళలు కొందరైతే వ్యవసాయ కూలీలుగా మారి తమ కుటుంబాల కోసం ఆర్థిక తోడ్పాటు అందించిన మహిళలు ఉన్నారు యువతిగా ఉన్నప్పుడు పుట్టింటి కోసం వివాహం తర్వాత మెటర్నెంట్ కోసం గర్భవతి గానే ఉంటూ ప్రసవ సమయం వరకు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ ఉండేవారే మరి ఆ రోజుల్లో ఆమె కృషిని ఇటు తల్లి కుటుంబం కానీ అటు అత్త కుటుంబం కానీ గుర్తించిందా లేదు ఎందుకంటే అంతకుముందు వారి జీవితం కూడా ఇంతే కాబట్టి ఇలా ఎన్నో ఉదాహరణలు ఉమ్మడి కుటుంబాలకు మూలం స్త్రీయే కదా. అందరం కలిసి మెలసి ఉండి బాధ్యతలు పంచుకుంటూ అనురాగాన్ని పెంచుకుంటూ ఉమ్మడి కుటుంబాలు మన కుటుంబ వ్యవస్థలకు మూల స్తంభం కాదా? సఖ్యతగా లేకుంటే ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ మనం అనుసరిస్తున్న సంస్కృతి సంప్రదాయాలకు మూలాలు ఎక్కడ ఒకనాడు కేవలం ఇంటికి, వంటింటికి పరిమితం అయిన మహిళ బాల్య వివాహాల వలన తనకంటే రెండింతల వయస్సు ఉన్న వారికి ఇచ్చి పెళ్లి చేసి తర్వాత తన భర్త చిన్నతనంలోనే చనిపోతే గుండు గీయించి కేవలం తెల్ల చీరలకే అంకితం చేస్తూ తన సౌందర్యాన్ని నిర్వీర్యం చేసి అలంకరించుకోకూడదంటే అప్పటి మహిళ ఎంత మానసిక ఆవేదనకు గురైందో కదా.

అష్టవర్షాత్ భవతి కన్య.. అంటూ 8 సంవత్సరాల వయసులోనే ఆడపిల్లకు పెళ్లి చేయాలని నియమాన్ని పెట్టింది ఈ మన సంప్రదాయలే కదా మరి మగవారికి ఇది వర్తించదా . భార్య చనిపోతే మళ్లీ వివాహం చేసుకొని బిడ్డల మీద బిడ్డలను కొనవచ్చా కన్యాశుల్కం సతీసాగనం ఆడవారికి ఎందుకు పెట్టినట్లు ప్రతి సాగమనాన్ని ఆనాటి సమాజం సాంప్రదాయాలకు ఎందుకు నియమాలు పెట్టలేదు అంటే స్త్రీ బలహీనురాలు నిర్ణయాధికారం తెలియదు అని చులకన భావం మరి బలహీనురాలైతే తన రక్తాన్ని ముద్దగా మార్చి 9 నెలలు అనుభవిస్తూ చావు అంచులకు వెళ్లి పిల్లలకు జన్మను ఎలా ఇవ్వగలదు మరి ఈ పనులను మగవారు ఎందుకు చేయకూడదు అంటే సృష్టి ధర్మం ప్రకృతి ధర్మం అంటూ వితండవాదాలు కేవలం ఇంటి మనిషిగా పిల్లలు కనే యంత్రాలుగా ఆ రోజుల్లో మహిళల పడ్డ కష్టాలు వారి త్యాగాలు లేకుంటే ఇప్పుడు ఉన్న స్త్రీ జాతి అసలు ఉండేది కాదు అయితే కాలక్రమేనా తరాలు మారుతున్నప్పుడు మహిళా శక్తిని గ్రహించిన పెద్దలు కందుకూరి వీరేశలింగం సావిత్రిబాయి పూలే జాతిపిత మహాత్మా గాంధీ ఇంకా ఎందరో మహిళల్లో మార్పు రావాలంటే స్త్రీ విద్య అవసరమని దాని ద్వారా ఆర్థికంగా సామాజికంగా తనకంటూ గుర్తింపు వస్తుందని పోరాటాలు చేసిన ఫలితమే ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం ఇది జరగడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా నడవగలిగితేనే స్త్రీ స్వాతంత్రం వచ్చినట్లు అని గాంధీజీ గారు బాల్యవివాహాలను సతీసాగమనాలను ఆపడానికి కందుకూరి వీరేశలింగం లాంటి వారి ఎందరో మహానుభావుల కృషి ఫలితం అలాగే బాలిక విద్య స్త్రీ విద్య కోసం సావిత్రిబాయి పూలే ఈ మహానుభావురాలు ఒక బ్రాహ్మణ కులస్త్రీలు అయినప్పటికీ కులం మతం వయస్సు చదువుకు అడ్డు కాదని ఎన్నో అవమానాలు భరించి చివరికి తాను సాధించిన విజయాలని మనం అనుభవిస్తున్నాం అయినా ఆ రోజు నుండి ఈరోజు వరకు ఇది మంచిదానికై మగవారే అహంకారానికి వావి వరసలు లేకుండా స్త్రీ జీవితాన్ని తమ కాళ్ళ కింద నలిపేస్తున్న ఈ కలియుగంలో కూడా స్త్రీ పరిస్థితి మారలేదు దీనికి కారణం పురుష అహంకారమా జాతీయ అహంకారమా మరి స్త్రీ లోపమా దీనికి అంతం ఎక్కడ గత 50 60 సంవత్సరాలుగా సమాన హక్కుల కోసం పోరాడే 40 శాతం విజయం సాధించాయి కానీ సాధించిన విజయాలను మనం అనుభవిస్తూ స్వాగతిస్తున్నామా ఒకప్పుడు తన పొలంలోనే వ్యవసాయ కూలీలుగా పని చేసే మహిళలు నేడు అంతరిక్షంలో కూడా ఎగరకలుగుతుంది అంటే స్త్రీ తలుచుకుంటే సాధ్యం కానిది ఏమీ లేదు స్త్రీ శక్తి స్వరూపిణే కదా అని అర్థం . మరి ఆర్థిక రంగాలతో పాటు ఇతర రంగాల్లో కూడా అభివృద్ధి సాధిస్తూ తమకంటూ ప్రత్యేక స్థానాన్ని గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళలు ఇప్పటికీ గృహహింసకు అరాచకాలకు ఆత్మహత్యలకు పురుషాహంకారానికి మానభంగాలకు ఎందుకు గురి అవుతున్నారు?

మహిళా అభివృద్ధి సాధించాలి.. శుభపరిణామమే కానీ మళ్లీ కథ మొదటికే వస్తుంది కదా ఇలాంటి సంఘటనలు నిత్యం చూస్తున్న మనం ఎందుకు స్పందించడం లేదు అంటే మన వరకు రాలేదు కాబట్టి అంతేనా మన కుటుంబాలను ఆర్థికంగా ఉన్న స్థానం ఉన్నత స్థానంలో నిలబెట్టాలని భర్తతో కలిసి ఉద్యోగాల పేరిట వ్యాపారాల పేరిట ఎంతో ఇష్టం పడుతున్నాం ఆడవాళ్లను అభివృద్ధి చెందకుండా చూడాలి అని ఇంకా ఈ పురుషాంగం భావన నరహరాలు ఉంది వేదికలకి స్త్రీ తలుచుకుంటే సాధించలేని తెలియదు అమ్మగా అక్కగా, ఇల్లాలిగా ఇలా రకరకాల బాధ్యతలు నిర్వహిస్తూనే ఆర్థిక క్రీడా పారిశ్రామిక రంగంలో దూసుకుపోతూ ఆడది అబల కాదు సబల అని ఉపన్యాసాలు ఇచ్చే ఆ మగవాడి మనసులో ఎక్కడో స్వార్థం అసూయ ఆడవారిని అనగదొక్కాలని భావం . మరి ఇలాంటప్పుడు మనం అబలలమా సభలలమా ఈ మధ్య జరిగిన యదార్థ సంఘటనలు ఇంటర్ పరీక్షలు రాసి వస్తున్న అమ్మాయి ఆర్టీసీ బస్సులో లైంగికదాడికి గురైంది. అదేవిధంగా వేరే రాష్ట్రంలో ఒక క్యాబ్ డ్రైవర్ క్యాబ్లో మహిళను ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ఘోరంగా లైంగికదాడి చేసి, ఆమె బతికి ఉంటే ప్రమాదమని మేడపైనుంచి తోసి చంపేశాడు. ఫోన్ నెట్వర్క్ ఆధారంగా అతని పట్టుకుని పోలీసులు అరెస్టు చేశారు. అతనికి ఏదో కొన్ని సంవత్సరాలు శిక్ష పడి బయటకు వస్తాడు. మరి ఈ రెండు సంఘటనల్లో దాడికి గురైనవారి కుటుంబాల పరిస్థితి ఏంటి? ఇలాంటివి చదువుతున్న మనకే ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంటే ప్రత్యక్షంగా ఆ దయనీయ పరిస్థితి అనుభవించిన వారి స్థితి ఏమిటి? ఊహించగలమా? ఆ కుటుంబాల్లో ఉన్న వివాహ వయసుకు వచ్చిన వారి మానసిక సామాజిక పరిస్థితి ఏమిటి? ఊహించగలమా? సభ్య సమాజం తల దించుకునే ఒక యదార్థ సంఘటన ఒక రాష్ట్రంలో ఏవో కారణాల వలన ఆత్మహత్యకు గురై డెడ్ బాడీ ఆస్పత్రిలో ఉన్న ఆ యువతిపై ఒక యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. మరో సంఘటన ఐదు సంవత్సరాల లేత పసి అమ్మాయిపై 25 సంవత్సరాల ఒక యువకుడు ఆ అమ్మాయిని అనుభవించే సమయంలో అమ్మాయి అతి ఘోరంగా చనిపోయింది. మరి గాంధీజీ కలలు కన్నా నటి రాత్రి స్వాతంత్ర్యం జెట్ విమానాలు నడుపుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో పురుషులతో సమానంగా ఇంకా ఎక్కువే అభివృద్ధి సాధిస్తున్న సభలను అని చెప్పుకునే అభలలకు ఈ అరాచకాల నుండి పురుష అహంకారం నుండి ముక్తి లేదా గృహహింస మహిళా రక్షణ చట్టాలు ఎవరికోసం హై మిడిల్ క్లాస్ లోని మహిళల గృహంస గురి అవుతూనే యువతులపై లైంగిక వేధింపులు జరుగుతున్న మానసిక ఒత్తిడికి లోనై బలవన్మరణాలు చేసుకుంటున్న ఉదంతాలు రోజూ మనం చూస్తూనే ఉన్నాం.

ఏదైనా ఇలాంటి సంఘటన ఒకటి జరిగినప్పుడు తాత్కాలికంగా ప్రభుత్వాలు సంఘటనలు జరిగిన కుటుంబాలకు విలువ కట్టి ఆర్థిక నష్ట పరిహారాలు ఇచ్చి చేతులు దులుపుకొని 24 గంటలు కాకముందే ఇంకొక సంఘటన ఉన్నారు పునరావృతం ఒక మనిషి అనుమతి లేకుండా ఆమెపై అత్యాచారం చేయడం నిజం బయటకు వస్తుందని వారిని దారుణంగా చంపే అవకాశం వారికి ఎవరిచ్చారు ఇలా చేయమని మన భారత రాజ్యాంగంలో ఎక్కడ రాసి ఉంది ఇలాంటి వారికి కఠిన శిక్షలు వేయకుండా మళ్లీ సమాజంలోకి పంపితే శిక్షలకు అలవాటు పడేవారు మరో తప్పు చేయకుండా ఉంటారా అందుకే స్త్రీ లోకం దీనికి పరిష్కారం ఏమిటి భారత దేశంలో 100 కోట్ల మహిళలు ఉంటే ఇలాంటి అత్యాచారం ఒంటరి మహిళపై జరిగినప్పుడు ఆ గొంతు వార్త నాదాలు 999 కోట్ల మహిళలకు వినిపించడం లేదా ఒక తాబేలు తన కనుసన్నలపై కుటుంబాన్ని పిల్లలను కాపాడుకుంటుంటే ఆ బల నుండి సభలగా మారిన మహిళాభివృద్ధి సాధికారత ఆర్థిక అభివృద్ధి రక్షణ చట్టాలు మళ్లీ మనల్ని సభలను మార్చేస్తున్నాయి కదా ప్రకృతికి మూలమైన స్త్రీ జాతి అంతరించిపోతున్న ఈ సమయంలో మన ముందు తరాల పిల్లలు కాపాడుకోవాలంటే శాశ్వత పరిష్కారం కావాలంటే 100 కోట్ల గొంతులను ఒకటిగా కావాలి మొన్న ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ముగ్గురు కంటే ఎక్కువ పిల్లలను కన్నవారికి 25వేల రూపాయలు వారికి ఉచిత రెసిడెన్షియల్ విద్య అందిస్తామని ప్రకటించారు. దీనిని బట్టి స్త్రీ జాతి అంతరించిపోతుందనే కదా అర్థం మరి మన జాతిని కాపాడుకునే సత్తా మనలో లేదా అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్న మనం మనం ముందు తరాల వారి కోసం గతంలో మహానుభావులు శ్రీ జాతి కోసం చేసిన పోరాటాలు తెచ్చుకొని అత్యాచారాలకు దుష్టజలకు అడ్డుకట్ట వేయలేమా ఒకప్పుడు కడప దాటి బయటికి రాలేని మనం ఇప్పుడు మనం అన్ని అవకాశాలు అందిపుచ్చుకుంటున్న మన దగ్గరికి వస్తే చూసుకుందాం అనే ధోరణిలో ఎందుకు ఉంటున్నాం. చేయి చేయి కలిస్తే చప్పట్లు మోగినట్లు మన గొంతుకలను కలిపి రాజ్యాంగాన్ని సవరించాలని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ఎలాంటి విచారణలు చేపట్టకుండానే ఉరిశిక్ష విధించాలని, చట్టం కావాలని మళ్లీ మళ్లీ మనం ఒకసారి శాంతియుతంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు ప్రభుత్వాలకు న్యాయం వ్యవస్థలకు ఒకే విషయంతో చట్టాన్ని సవరించాలని ఎందుకు ఉత్తరం రాయకూడదు? ఒక్కరోజు అంటే ఒక్కరోజు స్త్రీ లేకుండా మనుగడ సాగుతుందా? అని ప్రశ్నించే హక్కు మనకు ఉన్నప్పుడు మనం ఎందుకు ముందడుగు వేయకూడదు? అందుకే మనం ఆలోచించుకుంటూ స్త్రీ శక్తి స్వరూపిణి అని మరొక్కసారి ఈ కలియుగ రాక్షస కాలంలో నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది అని తెలియజేస్తూ .. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



డాక్టర్ ఖండేరావు సుధారాణి
అధ్యక్షురాలు, చేయూత వెల్ఫేర్ సొసైటీ
భారత జాతీయ యువజన అవార్డు గ్రహీత

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.